ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
స్టేట్ విజన్
STATE VISION
బుధవారం 15-07-2026 పేజీలు : 16

## ప్రయాణికుల అవస్థలు



11 పేజీలో...

## అక్రమార్కుల గొడ్డలి వేటు...



### పచ్చని చెట్లు విలవిల!

- తాడిచెర్లలో నిరాటంకంగా వృక్షాల నరికివేత..
- అధికారుల అండదండలతోనే అక్రమ వ్యాపారం?

మల్హార్, జూలై 14 విజన్ ఆంధ్ర : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ రావు మండల పరిధిలో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోంది. మల్హార్ లో గత కొన్ని సంవత్సరాలుగా వందలాది పచ్చని వృక్షాలను అక్రమంగా నరికివేస్తూ ధ్వంసం చేస్తున్నారు. ముఖ్యంగా ఔషధ గుణాలున్న వేప చెట్లతో పాటు దుర్షన్, చింత వృక్షాలే లక్ష్యంగా ఈ అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ అక్రమ కలప వ్యాపారంలో అటవీ శాఖ అధికారుల పాత్రపై పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులకు భారీగా ముడుపులు అందుతుండడం వల్లే వారు కళ్ళుండి లేనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూగర్భ జలాల పరిరక్షణ, చెట్ల పెంపకం కోసం ఉద్దేశించిన 'వాల్టా' చట్టంలోని కొన్ని

17 పేజీలో...

## సుచిత్ర యూ-టర్న్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



- ఐషర్ ఢీకొనడంతో యువకుడు దుర్మరణం..
- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు
- ఫ్రెండ్స్ సర్కిల్ రెస్టారెంట్ సమీపంలో ప్రమాదం
- బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన ఐషర్ వాహనం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి
- గాయపడిన రైడర్‌కు కొనసాగుతున్న వైద్యం
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పేట్ బషీరాబాద్ పోలీసులు

పేట్ బషీరాబాద్, జూలై 14 ( విజన్ ఆంధ్ర): సుచిత్ర ప్రాంతంలోని ఫ్రెండ్స్ సర్కిల్ రెస్టారెంట్ యూ-టర్న్ వద్ద మంగళవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డాడు.

16 పేజీలో...

## విద్యార్థులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వ వైఖరి మారాలి

- ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్ - స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి

9 పేజీలో...

## చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి సువర్ణావకాశం !!

**ఈ నెల 18న ప్రత్యేక లోక్ అదాలత్**


**గోదావరిఖని కోర్టులో 692 చెక్ బౌన్స్ కేసులు పెండింగ్**

**అదనపు జిల్లా న్యాయమూర్తి కోట్ల లావణ్య బాల్ రెడ్డి**

14 పేజీలో...

## శివంపేట సమీపంలో జాతీయ రహదారిపై బొలెరో వాహనానికి మంటలు..

### ఇద్దరికి స్వల్ప గాయాలు



చౌటకూర్ జూలై 14 (విజన్ ఆంధ్ర) : చౌటకూర్ మండలం శివంపేట సమీపంలోని అకోలా-నాందేడ్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-161)పై మంగళవారం బొలెరో వాహనానికి ఒక్కసారిగా మంటలు చెలరేగిన ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో వాహనం పూర్తిగా దగ్ధమైంది. అయితే వాహనంలోని ఇద్దరు ప్రయాణికులు సమయానికి బయటకు దిగడంతో ప్రాణాపాయం తప్పి స్వల్ప గాయాలతో బయటపడ్డారు.సమాచారం ప్రకారం, సిద్ధిపేట ప్రాంతానికి చెందిన మహేందర్‌తో పాటు మరో వ్యక్తి బొలెరో వాహనంలో హైదరాబాద్ బోయిన్‌పల్లి నుంచి సంగారెడ్డి మీదుగా సిద్ధిపేటకు వెళ్తుండగా, శివంపేట సమీపానికి రాగానే వాహనం ఇంజిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే వాహనాన్ని రహదారి పక్కకు నిలిపి ఇద్దరూ బయటకు దిగడంతో పెద్ద ప్రమాదం తప్పింది.అయితే కొద్దిసేపటికే మంటలు వేగంగా వ్యాపించి బొలెరో వాహనం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని రక్షించి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పుల్కల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం హైవే సిబ్బంది క్రేన్ సాయంతో దగ్ధమైన వాహనాన్ని రహదారి నుంచి తొలగించడంతో ట్రాఫిక్ సాధారణ స్థితికి చేరుకుంది.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పుల్కల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# టేకులపల్లిలో నూతన తహసిల్దార్ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

## - రూ.2.25 కోట్లతో ఆధునిక భవనం నిర్మాణానికి సన్నాహాలు
## - హౌసింగ్ శాఖ అధికారుల క్షేత్ర పరిశీలన



టేకులపల్లి జూలై 14 (విజన్ ఆంధ్ర ) : ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నూతన ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా టేకులపల్లి మండల తహసిల్దార్ కార్యాలయానికి కొత్త భవనం నిర్మాణ పనులు వేగం పుంజుకుంటున్నాయి. భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించేందుకు మంగళవారం తెలంగాణ హౌసింగ్ డిపార్ట్మెంట్ ఉన్నతాధికారులు టేకులపల్లి మండలానికి చేరుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న లేదా శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జీవో ఆర్.టి. నెం.375 (25-06-2026) ద్వారా 10 ఆర్డీవో కార్యాలయాలు, 107 తహసిల్దార్ కార్యాలయాల నిర్మాణానికి రూ.263.25 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఒక్కో తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్లు కేటాయించింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంజూరైన నాలుగు నూతన తహసిల్దార్ కార్యాలయ భవనాల్లో టేకులపల్లి కూడా చోటు దక్కించుకోవడం మండలానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది.ప్రస్తుతం కొనసాగుతున్న తహసిల్దార్ కార్యాలయ ఆవరణలోనే నూతన భవనం నిర్మాణానికి అనువైన స్థలాన్ని తహసిల్దార్ ఎల్. వీరభద్రం హౌసింగ్ శాఖ అధికారులకు చూపించారు. అధికారులు స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్మాణానికి అవసరమైన ప్రాథమిక కొలతలు తీసుకున్నారు. భవన నిర్మాణానికి సంబంధించి సాంకేతిక అంశాలను కూడా పరిశీలించారు.స్థల పరిశీలనలో హౌసింగ్ డిపార్ట్మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాయిరాం, డీఈ ఖలీల్, జేఈ గణేష్, స్థానిక రెవెన్యూ సిబ్బంది, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ఎల్. వీరభద్రం మాట్లాడుతూ, త్వరలోనే అత్యాధునిక వసతులతో కూడిన నూతన తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణం ప్రారంభమవుతుందని, దీంతో ప్రజలకు ఒకే చోట వేగవంతమైన, మెరుగైన రెవెన్యూ సేవలు అందడంతో పాటు సిబ్బందికి కూడా మెరుగైన కార్యాలయ వాతావరణం కల్పించబడుతుందని తెలిపారు. కొత్త భవనం నిర్మాణం పూర్తయితే టేకులపల్లి మండల రెవెన్యూ పరిపాలన మరింత సమర్థవంతంగా మారుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా నింపాలి



**తాటికొండ సీతయ్య- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు**

**నిరక్షరాస్య ఓటర్లకు సహకరించాలని బూత్ లెవల్ ఏజెంట్లకు విజ్ఞప్తి**

తుంగతుర్తి: జూలై 14 ( విజన్ ఆంధ్ర) : ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా నింపి సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ)కు అందజేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా బీఎల్ఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నిరక్షరాస్యులైన ఓటర్లకు బూత్ లెవల్ ఏజెంట్లు సహకరించి ఎన్యూమరేషన్ దరఖాస్తులను పూర్తిగా నింపి సమర్పించేలా సహాయం చేయాలని ఆయన కోరారు.ఇప్పటికే అన్నారం, తుంగతుర్తి, వెలుగుపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి ఓటర్లకు అవసరమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు.ఎన్యూమరేషన్ ప్రక్రియను ప్రతి ఓటరు బాధ్యతగా భావించి, గడువులోపు దరఖాస్తులు సమర్పించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని తాటికొండ సీతయ్య విజ్ఞప్తి చేశారు.

# చిన్నారుల ఆరోగ్య సంరక్షణే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



బోథ్. జూలై 14. (విజన్ ఆంధ్ర) : చిన్నారుల ఆరోగ్య సంరక్షణే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్య నారాయణ, సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ లు అన్నారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించి ఆరోగ్యవంతమైన భావితరాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బాల అమృతం -- తొలి ముద్ద కార్యక్రమాన్ని మంగళ వారం బోథ్ మండల కేంద్రంలోని సాయినగర్ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఉప్మాతో తొలి ముద్ద తినిపించి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు పోషకాహారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన పోషకాహారాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన సమతుల్య ఆహారాన్ని అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించి ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ నర్సమ్మ, సూపర్వైజర్ మోనికా,బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ రాజు యాదవ్, బోథ్ మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ మెరుగు బోజన్న, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కుర్మే మహేందర్, అంగన్వాడీ టీచర్లు లలిత, భూలక్ష్మి, శాకుంతల, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు నరసింహ దాస్, బిట్లింగ్ గిరీష్, సన్నీ రెడ్డి, అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆగవు

## - వామపక్ష నేతలు




మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, జూలై 14 విజన్ ఆంధ్ర : విద్యార్థి సంఘాల 'చలో సెక్రటేరియట్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం అర్ధరాత్రి నుంచి అక్రమ అరెస్టులకు పాల్పడిందని వామపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేనట్లే, అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను అణచివేయడం సాధ్యం కాదన్నారు. విద్యార్థుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, వారి సమస్యలను పరిష్కరించకుండా ఉద్యమాలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. అరెస్టులు, కేసులతో పోరాటాలను నిలువరించలేరని హెచ్చరించారు. ఈ అక్రమ అరెస్టుల్లో ఏ ఐ ఎఫ్ డి ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, ఎంపీజేయు జిల్లా సహాయ కార్యదర్శి తదితరులు ఉన్నట్లు తెలిపారు.

# ఎమ్మెల్యే అనుచరులమంటూ రైతు భూమి పై కన్ను...

భూపాలపల్లి జిల్లా జూలై 14 (విజన్ ఆంధ్ర ) : చిట్యాల మండలం చింతకుంట రామయ్యపల్లి గ్రామానికి చెందిన రైతు అబ్బెంగుల రాజయ్య ఎకరం భూమిని గత 13 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసి కాస్తు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త స్థానిక ఎమ్మెల్యే అనుచరుడిని అని చెప్పుకుంటూ అతని అనుచరుల తో పత్తి చేను ను ధ్వంసం చేసి నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేసాడు. మధు వంశీ తన అనుచరులతో కలిసి రెండు సంవత్సరాలనుండి నన్ను ఇబ్బందులకు గురి చేస్తున్నాడు జిల్లా కలెక్టర్ మరియు రెవిన్యూ అధికారి సమక్షంలో విచారణ జరిపి నాకు న్యాయం చేయాలని ఆ రైతు వేడుకుంటున్నాడు. స్థానిక పోలీస్ స్టేషన్ లో పత్తి చేను చెడగొట్టిన వారిపై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. స్థానిక ఎమ్మెల్యే అనుచరుడు మధువంశీ,మురళి,నటరాజ్ కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ,తమకు ప్రాణహాని ఉందని రైతు కుటుంబ సభ్యులు కన్నీటి కూన్నీరు మున్నీరు అయి చేతులు జోడించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కొ రుతున్నారు.



# బుధవారం జరగాల్సిన నీటి విడుదల కార్యక్రమం వాయిదా

చర్ల, (భద్రాద్రి కొత్తగూడెం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నియోజకవర్గంలో ఈనెల 15న జరగాల్సిన తాలి పేరు నీటి విడుదల కార్యక్రమం వాయిదా పడింది. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు నియోజకవర్గ అభివృద్ధి పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లాల్సి రావడంతో ఈ మార్పు చేసినట్లు ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు తెలిపారు. వాయిదా పడిన ఈ కార్యక్రమం 16వ తేదీ (గురువారం) ఉదయం 10 గంటలకు జరుగుతుందని, రైతులు, ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# యువ హామీల అమలుపై కాంగ్రెస్‌ను నిలదీయాలి

**-18న సరూర్‌నగర్‌లో 'యువ సంగ్రామ సదస్సు' విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పిలుపు**

**-అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్.. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు**

**-రైతులు, మహిళలు, ఉద్యోగులు, బలహీన వర్గాలందరికీ అన్యాయం జరిగిందన్న బీఆర్ఎస్ నేతలు**

**-రాష్ట్ర నలుమూలల నుంచి యువత భారీగా హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపు**

పేట్‌బషీరాబాద్, జూలై 14 (విజన్ ఆంధ్ర); రాష్ట్రంలో యువతకు ఇచ్చిన ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, అమలు కాని హామీలపై తెలంగాణ యువత సమరశంఖం పూరించాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు శంభీపూర్ రాజు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న "యువ సంగ్రామ సదస్సు" విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధ్యక్షత వహించగా, ఎమ్మెల్సీ శంభీపూర్




రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు కార్యక్రమ నిర్వహణ, ప్రజల సమీకరణ, యువత భాగస్వామ్యం తదితర అంశాలపై పలు సూచనలు, దిశానిర్దేశాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ హామీని అమలు చేయలేదని, దీంతో నిరుద్యోగ యువత ఆశలు అడియాశలయ్యాయని విమర్శించారు. ప్రాజెక్టుల్లో తగినంత నీరు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు విడుదల చేయకుండా పంటలు ఎండిపోయే పరిస్థితులు తీసుకొచ్చారని ఆరోపించారు. ఉద్యోగులు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాలు, యువతతో పాటు అన్ని వర్గాలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, యువత తదితర వర్గాల కోసం ప్రకటించిన 13 డిక్లరేషన్లలోని హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల గురించి ప్రజలు, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా ఒత్తిళ్లు, కేసుల బెదిరింపులతో భయపెట్టే ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. ప్రజలు ఇచ్చిన పాలనా కాలంలో ఇప్పటికే సగానికి పైగా పూర్తయినా, ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం ఆశించిన పురోగతి చూపలేకపోయిందని అన్నారు. సంక్షేమ పథకాలను సైతం సమర్థంగా కొనసాగించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. 2023 జూలై 18న ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌లో రెండు లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, యువతకు ప్రత్యేక ఆర్థిక సహాయ పథకాలు వంటి అనేక హామీలు ఇచ్చినా, దాదాపు మూడేళ్లు గడుస్తున్నా అమలు కాలేదని విమర్శించారు. ఈ హామీల అమలు కోసం "యువ సంగ్రామ సదస్సు" వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని, యువత హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ నెల 18వ తేదీన సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే యువ సంగ్రామ సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుంచి యువత, పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పర్ణశాల - రాళ్లగూడెం మార్గంలో ఘోర రోడ్డు ప్రమాదం - ఒకరి పరిస్థితి విషమం



చర్ల (భద్రాద్రి కొత్తగూడెం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పర్ణశాల – రాళ్లగూడెం ప్రధాన రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలవ్వగా, వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం,ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు

## వైభవంగా స్వామి వారికి అష్టదళ పాద పద్మారాధన పూజ

స్టేషన్ ఘన్‌పూర్, (జనగామ): చిల్పూరు గుట్ట శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారికి అష్టదళ పాద పద్మారాధన పూజ బంగారు పద్మాలతో అంగరంగ వైభవంగా అర్చకులు నిర్వహించారు. దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు కిరణ్మయి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో ఈవో లక్ష్మీ ప్రసన్న, రాజేందర్ రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు బి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి గా గోపాల్ రావు నియామకం.. అభిమానుల అభినందనల వెల్లువ

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) జులై 15: భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధిగా కూకట్ పల్లి కి చెందిన ఆ పార్టీ సీనియర్ నేత ఏ.గోపాల్ రావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు, అభిమానులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వివేకానంద నగర్ డివిజన్ ఉపాధ్యక్షులు సి.హెచ్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం గోపాల్ రావు నివాసంలో గోపాల్ రావును కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలుయజేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కే.వేణు తో పాటుగా డివిజన్ ఉపాధ్యక్షులు కరుణాకర్ రావు, సీనియర్ నాయకులు కనక చంద్రం, బీజేవైఎం నాయకులు హరీష్ యాదవ్, మల్లికార్జున్ రెడ్డి , రాహుల్ తేజ , వివేక్ , రాజేందర్ తదితరులు పాల్గొన్నారు

# రోడ్డా.. లేక అడవా..?

**- గోలియా తండ రెండో వార్డులో పిచ్చి మొక్కల రాజ్యం**

**- ప్రజల రాకపోకలకు అడ్డంకి**

**- వర్షాకాలంలో విషసర్పాలు, విషపురుగుల భయంతో బిక్కుబిక్కుమంటున్న కుటుంబాలు**

**- పంచాయతీ నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తుతున్న స్థానికులు**

టేకులపల్లి మండలం (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా) : టేకులపల్లి మండలం గోలియా తండ గ్రామపంచాయతీ పరిధిలోని రెండో వార్డు రహదారులు ప్రస్తుతం పిచ్చి మొక్కలతో పూర్తిగా కప్పుకుపోయి ప్రజలకు నిత్య ఇబ్బందిగా మారాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఒకప్పుడు సులభంగా నడిచే దారి ఇప్పుడు అడవిని తలపించేలా మారిందని, చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయంతోనే రాకపోకలు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి కలుపు మొక్కలు వేగంగా పెరిగినా వాటిని తొలగించే చర్యలు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. రహదారి ఎక్కడ ఉందో గుర్తించడం కూడా కష్టంగా మారిందని, పాములు, తేళ్లు, ఇతర విషపురుగులు దాక్కునే పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు.

ప్రజల ఫిర్యాదులు... చర్యలు ఎక్కడ?

గ్రామస్థుల కథనం ప్రకారం, సమస్యను పలుమార్లు ఫోటోలు, వీడియోల రూపంలో గ్రామపంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్పందన రాలేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన స్థానిక సంస్థలు సమయానికి స్పందించకపోతే గ్రామాల్లో పారిశుద్ధ్యం, భద్రత ఎలా మెరుగుపడుతుందని వారు



ప్రశ్నిస్తున్నారు.

ఎవరి బాధ్యత..?

గ్రామపంచాయతీ పరిధిలో రహదారుల నిర్వహణ, కలుపు మొక్కల తొలగింపు, పారిశుద్ధ్య చర్యలు క్రమం తప్పకుండా చేపట్టాల్సి ఉండగా, ఈ ప్రాంతంలో ఆ పనులు సక్రమంగా జరుగుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి వాస్తవ పరిస్థితులను అంచనా వేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గ్రామస్థుల ప్రధాన డిమాండ్లు

రహదారిపై పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలి.

రెండో వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించాలి.

రాకపోకలకు అనువుగా రహదారిని పునరుద్ధరించాలి.

ప్రజల ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి తక్షణ చర్యలు తీసుకోవాలి.

# అమలుకు నోచుకోని జర్నలిస్టుల సంక్షేమ హామీలు

## నిరసనగా టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ముందు ధర్నా




మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జులై 13 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నిర్దిష్టంగా అమలుచేయాలని మీడియా స్వేచ్ఛ కాపాడాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ( టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాపిత పిలుపులో బాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని భారీగా నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎస్ కె సలీమా, గుమ్మడి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, కార్యదర్శి బనావత్ రవి నాయక్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అర్హులైన వారందరికీ వెంటనే అక్రిడేషన్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు, పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయతీలు ఇండ్ల స్థలాల హామీలు అమలు విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవరిస్తుందని అన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని లేందంటే ఆందోళ తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా, నియోజక వర్గం ఇంచార్జ్ లు నాయకులు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# నక్షత్ర వనమోత్సవం విజయవంతం చేయండి... ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ



విజన్ ఆంధ్ర / చేగుంట జూలై 14: చేగుంట మంగళవారం రోజున చేగుంట మండల కేంద్రంలోని సీఎంఆర్ కాలనీలోని శ్రీశ్రీ హనుమాన్ విగ్రహం వద్ద నిర్వహించే 97 రూల నక్షత్రాల వనమహోత్సవను విజయవంతం చేయాలని చేగుంట మండల ఉప సర్పంచ్ ల పోరం అధ్యక్షులు, వేగుంట ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ తెలిపారు. సోమవారం రోజు ఆయన మాట్లాడుతూ అమణాన మంగళవారం రోజు చెట్లు నాటే మంచి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు 27 నక్షత్రాలకు సంబందించిన వివిధ రకాల మొక్కలు నాటుతున్నట్లు ఈ కార్యక్రమం వేద పండితులతో ఉదయం 10 గంటలకు ముఖ్య అధితులచే ప్రారంబమవుతుందని కావునా ప్రతి ఒక్కరు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# శాశ్వత నాన్‌వెజ్ మార్కెట్ భవనాన్ని పూర్తి చేయాలి



టసిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌ఊ విజన్ ఆంధ్ర జులై 14 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ పట్టణంలోని ఎల్లమ్మ బజార్ రోడ్డులో పాత ఎమ్మార్వో కార్యాలయం వద్ద గత కొన్ని సంవత్సరాలుగా సుమారు 20 మంది ముదిరాజ్ చేపల వ్యాపారులు తమ కులవృత్తిగా చేపలు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వీరితో పాటు మరో 15 మంది కార్మికులు కూడా ఈ వ్యాపారంపై ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నారు.ప్రస్తుతం అదే ప్రాంతంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో, నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతుందనే కారణంతో చేపల వ్యాపారులను అక్కడి నుంచి వెళ్లాలని కాంట్రాక్టర్ ప్రతినిధులు సూచించినట్లు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయాన్ని తెలుసుకున్న హుస్నాబాద్ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ 17వ వార్డు కౌన్సిలర్ గాదెపాక రవీందర్ ఆ స్థలాన్ని సందర్శించి చేపల వ్యాపారుల సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవనోపాధి కోసం ఎన్నో ఏళ్లుగా అక్కడే చేపల విక్రయాలు చేస్తున్న వారిని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా తొలగించడం సరైంది కాదన్నారు. నిర్మాణ పనులు కొనసాగించే క్రమంలో వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు తక్షణమే సమీపంలో తాత్కాలిక స్థలాన్ని కేటాయించి, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.అదేవిధంగా, 2022లో రూ.2.75 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేసిన నాన్‌వెజ్ మార్కెట్ భవనం ఇప్పటికీ అసంపూర్తిగా ఉండడం బాధాకరమన్నారు. ప్రస్తుతం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో, అదే సమయంలో అసంపూర్తిగా ఉన్న నాన్‌వెజ్ మార్కెట్ భవనాన్ని కూడా పూర్తి చేసి చేపల వ్యాపారులకు శాశ్వతంగా దుకాణాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని, మున్సిపల్ అధికారులను కోరారు.స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సమస్యపై ప్రత్యేక చొరవ తీసుకుని మా చేపల వ్యాపారుల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలిక ప్రత్యామ్నాయ స్థలాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, నాన్‌వెజ్ మార్కెట్ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి శాశ్వత వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.తాత్కాలికంగా సరైన స్థలం, అవసరమైన సౌకర్యాలు కల్పించి, అనంతరం నాన్‌వెజ్ మార్కెట్ భవనం పూర్తయిన తర్వాత అందులో శాశ్వతంగా షాపులు కేటాయించాలని చేపల వ్యాపారులు మున్సిపల్ అధికారులను కోరారు.

# హుస్నాబాద్ నకిలీ పోలీస్‌పై కేసు నమోదు

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 14 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో ఆదివారం రాత్రి రోజున రాత్రి 9:30 గంటలకు హుస్నాబాద్ బస్టాండ్ వద్ద తరిగొప్పుల గ్రామానికి చెందిన రామ్ కుమార్ అనే వ్యక్తి నేను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ ఆఫీసర్ అని చెబుతూ హుస్నాబాద్ చెందిన ఇద్దరు యువకులను ఆపి మీ మీద కేసులు ఉన్నాయని చెప్పి కేసుల నుండి తప్పించుకోవాలంటే మీరు 15 వేల రూపాయలు ఇవ్వాలని భయభ్రాంతులకు గురి చేశారు. డబ్బులు ఇస్తే మిమ్మల్ని వదిలిపెడతానని బెదిరించినాడని ఇద్దరు యువకులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.వెంటనే స్పందించిన హుస్నాబాద్ పోలీసులు తరిగొప్పుల గ్రామానికి చెందిన రామ్ కుమార్ అను వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరు యువకులు మాట్లాడుతూ మా మీద ఏమి కేసు లు లేవు పోలీస్ స్టేషన్ కి వెళ్దాం పద అనడంతో అక్కడ నుండి వెళ్లి పోయినదన్నారు.రాంకుమార్ మీద కేసు నమోదు చేశామని, ఇలాంటి బెదిరింపులకు ఎవరు పాల్పడిన చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వైద్య సేవల్లో పారదర్శకతకు పిలుపు

## రోగి నమ్మకమే ఆరోగ్య సమాజానికి పునాది





**"వైద్యో నారాయణో హరిః" --**

"వైద్యో నారాయణో హరిః" – సమాజంలో వైద్యులను దేవుడితో సమానంగా చూసే సంస్కృతి మనది. ప్రాణాలు కాపాడే వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది. కానీ, ఆధునిక కాలంలో వైద్యరంగం కార్పొరేటీకరణ వైపు అడుగులు వేస్తున్న కొద్దీ.. సేవాభావం తగ్గి, వ్యాపార దృక్పథం పెరుగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, వైద్య సేవల్లో "పారదర్శకత" అనేది కేవలం ఒక అవసరం మాత్రమే కాదు, రోగుల ప్రాథమిక హక్కు.

పారదర్శకత ఎందుకు లోపిస్తోంది?

ప్రస్తుత వైద్య వ్యవస్థలో రోగులు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు కొన్ని:

నిగూఢమైన ఖర్చులు: ఆసుపత్రిలో చేరేటప్పుడు చెప్పే ఖర్చులకు, డిశ్చార్జ్ అయ్యేటప్పుడు ఇచ్చే బిల్లుకు నక్కకూ నాగలోకానికీ ఉన్నంత తేడా ఉంటోంది. ఏ చికిత్సకు ఎంత ఖర్చవుతుందో ముందే స్పష్టంగా చెప్పకపోవడం వల్ల సామాన్యులు అప్పులపాలవుతున్నారు.

అనవసరమైన పరీక్షలు, మందులు: కేవలం కమీషన్ల కోసం, ఆసుపత్రి టార్గెట్ల కోసం అవసరం లేకపోయినా స్కానింగ్‌లు, ల్యాబ్ పరీక్షలు రాయడం, బ్రాండెడ్ (ఖరీదైన) మందులనే సిఫార్సు చేయడం సర్వసాధారణంగా మారింది.

సమాచార లోపం: రోగికి అసలు ఏమైంది? ఎలాంటి చికిత్స అందిస్తున్నారు? ప్రత్యామ్నాయాలు ఏమైనా ఉన్నాయా? అనే విషయాలను రోగి బంధువులకు వివరంగా వివరించే ఓపిక, సమయం చాలామంది వైద్యులకు కరువవుతోంది.

మార్పు ఎక్కడ రావాలి? (పారదర్శకతకు చర్యలు)

వైద్య వ్యవస్థపై ప్రజల్లో మళ్లీ నమ్మకం కలగాలంటే ఈ క్రింది మార్పులు అత్యవసరం:

1. చికిత్సల ధరల పట్టిక :

ప్రతి ఆసుపత్రి తమ రిసెప్షన్ వద్ద లేదా వెబ్‌సైట్‌లో వివిధ రకాల గదుల అద్దెలు, ఐసీయూ చార్జీలు, సాధారణ సర్జరీల ఖర్చుల వివరాలను బహిరంగంగా ప్రదర్శించాలి. చికిత్స ప్రారంభించడానికి ముందే ఒక అంచనా వ్యయాన్ని లిఖితపూర్వకంగా రోగి కుటుంబానికి అందించాలి.

2. జెనరిక్ మందుల ప్రోత్సాహం:

వైద్యులు ఖరీదైన బ్రాండెడ్ మందుల స్థానంలో నాణ్యమైన, చౌకగా దొరికే జెనరిక్ మందులను రాయాలి. అలాగే ప్రిస్క్రిప్షన్‌ను స్పష్టమైన అక్షరాలతో (ఝుజూఝుశ్రీ శ్రీవేతం) రాయడం ద్వారా రోగులకు అర్థమయ్యేలా చూడాలి.

3. డిజిటల్ హెల్త్ రికార్డులు ఉ రెండవ అభిప్రాయం:

రోగి యొక్క మెడికల్ రిపోర్టులు, కేస్ షీట్లను డిజిటల్ రూపంలో రోగులకు అందుబాటులో ఉంచాలి. తద్వారా వారు మరొక డాక్టర్ సలహా తీసుకోవాలనుకుంటే ఎటువంటి అడ్డంకులు ఉండకూడదు.

4. కౌన్సిలింగ్ మరియు సంభాషణ:

అత్యవసర పరిస్థితుల్లో లేదా పెద్ద సర్జరీలు చేసేటప్పుడు రోగి ఆరోగ్య పరిస్థితిని, అందులోని రిస్క్‌లను కుటుంబ సభ్యులకు ఆత్మీయంగా, వివరంగా కౌన్సిలింగ్ చేయాలి. ఇది ఆసుపత్రులపై జరిగే దాడులను కూడా నివారిస్తుంది.

ప్రభుత్వాలు మరియు నిఘా సంస్థల పాత్ర

వైద్య సేవల్లో పారదర్శకతను అమలు చేయడం కేవలం ఆసుపత్రుల ఇష్టానికే వదిలేయకూడదు. 'క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్' వంటి చట్టాలను ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలి. రోగుల ఫిర్యాదులను స్వీకరించి, విచారించేందుకు ప్రత్యేక 'గ్రీవెన్స్ సెల్స్'లేదా హెల్ప్‌లైన్లను బలోపేతం చేయాలి.

నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

ముగింపు ....వైద్యం అనేది లాభనష్టాల బేరీజు వేసుకునే వ్యాపారం కాకూడదు. పారదర్శకత పెరిగినప్పుడే వైద్యులపై సమాజానికి ఉన్న గౌరవం, నమ్మకం మరింత బలపడతాయి. రోగికి ఎంత ఖర్చవుతుందో ముందే తెలిసి, సరైన చికిత్స అందుతుందనే భరోసా ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన సమాజ స్థాపన సాధ్యమవుతుంది. కాబట్టి, వైద్య సేవల్లో పారదర్శకత సాధన దిశగా ప్రభుత్వాలు, వైద్య రంగానికి చెందిన ప్రముఖులు బాధ్యతాయుతంగా అడుగులు వేయాలని పిలుపునిద్దాం.

--కే కనకరాజ్ గౌడ్ పెద్ద శంకరంపేట్

## తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రి తరలింపు విషయంలో మహేందర్ రెడ్డి మౌనం వీడాలి.

### -- బీఆర్ఎస్ నాయకులు సంతోష్ గౌడ్.



తాండూరు, జులై 14 (విజన్ ఆంధ్ర): తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రి తరలింపు విషయంలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి మౌనం వీడాలని బీఆర్ఎస్ నాయకులు సంతోష్ గౌడ్ కోరారు. తాండూరు ప్రజలకు గత 25 సంవత్సరాలుగా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రిని మరో ప్రాంతానికి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని బీఆర్ఎస్ నాయకులు సంతోష్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయ ప్రయోజనాల కోసం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిని తరలించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు అత్యంత దురదృష్టకరమని అన్నారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆసుపత్రిని తాండూరులోనే కొనసాగించేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిని తరలించే నిర్ణయం తీసుకుంటే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. తాండూరు ప్రజలతో మమేకమైన ఈ ప్రభుత్వ ఆసుపత్రిని ఎట్టి పరిస్థితుల్లోనూ తరలించనివ్వమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఇర్షాద్ , అనిల్, యోగానంద్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు రుద్రు పాటిల్, అజాజ్, అనంత్ రెడ్డి, కరుణాకర్, సంతోష్ మరియు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సిరిపురం గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాల, ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ఎంపీడీవో శాంతమ్మ

మర్పల్లి: జులై 14 (విజన్ ఆంధ్ర)మండలం సిరిపురం గ్రామంలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించి పాఠశాల ప్రహరీ గోడ , మరుగుదొడ్ల నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీవో శాంతమ్మ పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థు తో మాట్లాడారు. విద్యార్థుల నోటి పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి లబ్ధిదారులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం..

### - సర్పంచ్ ఆకుల భద్రప్ప



కుకునూరుపల్లి, జులై 14,విజన్ ఆంధ్ర : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు, తిప్పారం సర్పంచ్ ఆకుల భద్రప్ప అన్నారు. మంగళవారం ఆయన తిప్పారం గ్రామానికి చెందిన గడ్డం ఎల్లవ్వకు 35500రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెక్కు మంజూరికి సహకరించిన ముఖ్యమంత్రికి, స్థానిక శాసనసభ్యులు, మాజి ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ప్రతాప రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈసాల నవీన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఏబీవీపీ ఆందోళన..

### హుస్నాబాద్‌లో కళాశాలల బంద్ విజయవంతం

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 14 : రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో కళాశాలల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తరగతులను బహిష్కరించి బంద్‌ను విజయవంతం చేశారు. అనంతరం ఏబీవీపీ హుస్నాబాద్ నగర కార్యదర్శి బత్తుల రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో రూ.11 వేల కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేస్తున్నారని, వేలాది మంది తమ విద్యా సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి



అమలు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులను కాలరాస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్, జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ చరణ్, నగర ఉపాధ్యక్షులు సంతోష్, అంజి, సంయుక్త కార్యదర్శి రంజిత్, మహిళా కన్వీనర్ శిరీష, కో–కన్వీనర్ అశ్విని, మిషన్ సాహసి కో–కన్వీనర్ ప్రసన్నతో పాటు శరత్, కుమార్, శ్రావణ్, రామ్‌చరణ్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ లో ఓటర్ల వివరాలను తప్పులేకుండా నమోదు చేయాలి:

### మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, జులై 14 విజన్ ఆంధ్ర : ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ 2026 కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పట్టణ స్థానిక 31వ వార్డులోని 86, 88 పోలింగ్ బూత్‌ల పరిధిలో నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్, ఓటరు నమోదు కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి అర్హ ఓటరు తమ వివరాలను తప్పులేకుండా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం అందజేసిన ఎస్, ఐ ఆర్, ఫారం పూరించి సంబంధిత బీఎల్ఓకు అందజేయాలని కోరారు. ఎలాంటి సందేహాలు ఉన్నా స్థానిక 31వ వార్డు కౌన్సిలర్ బండారి స్రవంతి, నాయకులు బండారి ప్రవీణ్ ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరూ ఓటరు జాబితా సవరణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నునేటి సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి రెవెల్లి విజయ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, సీనియర్ నాయకుడు సుందర్‌రావు, బీఎల్ఏలు ఆయాజ్, ఎండీ సర్వర్ భాయ్, ఓదెలు, యువ నాయకుడు కొట్టే రాకేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# శంభీపూర్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కేంద్రం పరిశీలన

- అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి: కొలను హన్మంత్ రెడ్డి
- బూత్ స్థాయి అధికారులు పారదర్శకంగా ఓటరు నమోదు చేపట్టాలని సూచన
- పద్దెనిమిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఓటరుగా నమోదు కావాలని పిలుపు
- గ్రామ చెరువు ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం
- ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా

కుత్బుల్లాపూర్, జులై 14 విజన్ ఆంధ్ర కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని రెండువందల తొంభై ఆరవ డివిజన్ దుండిగల్ పరిధిలోని శంభీపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బూత్ స్థాయి అధికారులు ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఓటరు నమోదు ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయాలని, పద్దెనిమిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత కొత్త ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు గణన ఫారాలను పూర్తిగా నింపి నిర్ణీత గడువులోపు సమర్పించాలని కోరారు. అనంతరం గ్రామస్థులు తాగునీటి సమస్యతో పాటు గ్రామ చెరువు ఆక్రమణల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా, వెంటనే చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువుపై జరిగిన ఆక్రమణలను తొలగించి చెరువును పరిరక్షించేలా సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రెండు బోర్‌వెల్లు మంజూరు చేస్తామని కొలను హన్మంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజల




సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు అమరం ముత్యం రెడ్డి, దుండిగల్ డివిజన్ అధ్యక్షుడు జక్కుల మల్లేష్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి, పీసరి మహేందర్ రెడ్డి, మనోజ్ రెడ్డి, సంగొళ్ల నాగేష్, క్యాసారం సత్తయ్య, సంగొళ్ల శంకర్, మనోహర్, గురువా రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మండల రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు



దమ్మపేట,విజన్ ఆంధ్ర జూలై 14: దమ్మపేట మండలంలోని రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ సూచించింది. ఈ మేరకు మంగళవారం దమ్మపేట రైతు వేదికలో రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఎస్. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, గత వర్షాకాలంలో మండలంలో సుమారు 10 వేల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, అయితే ఈ ఏడాది ఇప్పటివరకు వెయ్యి ఎకరాల లోపు మాత్రమే వరి నాట్లు పూర్తయ్యాయని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడం, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు లేకపోవడం, భూగర్భ జలమట్టం తగ్గిపోవడం వల్ల వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో కూడా ఇదే తరహా వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రైతులు అధిక నీటి అవసరం ఉన్న వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే అపరాలు, చిరుధాన్యాలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని వ్యవసాయ అధికారి సూచించారు. ఈ సమావేశంలో ఆత్మ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, దమ్మపేట వ్యవసాయ శాఖ ఏఈఓ అను బాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ఏ ఒక్కరి ఓటు కోల్పోకుండా చూడాలి- ఎమ్మెల్యే అనిల్ జాదవ్



బోథ్. జూలై 14. (విజన్ ఆంధ్ర) అర్హత కలిగిన ఏ ఒక్కరూ కూడా తమ ఓటును కోల్పోకుండా చూడాలని అధికారులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. బోథ్ మండల కేంద్రంలో జరుగుతున్న సర్ ప్రక్రియను మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారుల ఫైళ్లను, ఫారంలను పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. తహశీల్దార్, ఎంపిడివో మరియు బీఎల్వోలతో మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవగాహన కల్పించాలని కోరారు. ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఓటర్లకు సమాచారం అందించి వారి ప్రక్రియ సైతం పూర్తి చేసేలా బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. డబుల్ ఓట్లను గుర్తించి నిజమైన ఓటర్లకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచుల సంఘం అధ్యక్షులు స్వామి, మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, సర్పంచ్ రవీందర్, బాబులాల్, విడిసి చైర్మన్ పోతన్న, ఎలుక రాజు, మల్లెపూల సుభాష్, రమణ గౌడ్, అల్లకొండ ప్రశాంత్, రఫీ, సంజీవ్, బాపురెడ్డి, వినయ్, ఇఫ్తేకార్, గోపాల్, సందీప్, ఉప సర్పంచ్ మామిడి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ వ్యాఖ్యలను ఖండించిన మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

**- రైతులకు నీళ్లు ఇవ్వాలి.. సీఎం తీరు మారాలి**



బెల్లంపల్లి, జూలై 14 విజన్ ఆంధ్ర : రైతులకు సాగునీరు ఇవ్వాలని కోరితే ప్రతిపక్ష నేతల రక్తం పారిస్తానంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తీవ్రంగా ఖండించారు.

మంగళవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక హనుమాన్ ఆలయంలో సీఎం భాష, బుద్ధి మారాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవిలో ఉన్న ముఖ్యమంత్రి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. విద్వేషాన్ని రెచ్చగొట్టేలా, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ప్రాజెక్టుల నుంచి సాగునీరు విడుదల చేసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. రైతులకు వెంటనే సాగునీరు అందించాలని, లేనిపక్షంలో రైతుల తరఫున ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.

అలాగే స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఆయన అనుచరుల బుద్ధి కూడా మారి ప్రభుత్వ భూముల కబ్జాలు నిలిచిపోవాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నూనేటి సత్యనారాయణ, కౌన్సిలర్ బండారి ప్రవంతి , పట్టణ ప్రధాన కార్యదర్శి రెవెల్లి విజయ్, నాయకులు, బండారి ప్రవీణ్, సుందర్‌రావు, రాకేష్, దితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల హామీల అమలే లక్ష్యంగా....
# బీఆర్ఎస్ 'ఛలో సరూర్‌నగర్' సన్నాహాలు

-జూలై 18న సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సు

-సదస్సు ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, పలువురు నేతలు

-విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం

-యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నేతల పిలుపు

-సదస్సు విజయవంతానికి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం



కుత్బుల్లాపూర్, జులై 14 (విజన్ ఆంధ్ర); నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న సరూర్‌నగర్ స్టేడియంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "ఛలో సరూర్‌నగర్ యువ సంగ్రామ సదస్సు" ఏర్పాట్లను బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు మంగళవారం పరిశీలించారు. సదస్సును విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, ప్రజల రాకపోకలు, భద్రత, పార్కింగ్ తదితర అంశాలపై నాయకులు అధికారులతో, నిర్వాహకులతో చర్చించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు మాట్లాడుతూ, 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్'లో ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, యువత సంక్షేమానికి సంబంధించిన హామీలను అమలు చేయకుండా విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు హామీల అమలుకు ఒత్తిడి తీసుకురావడమే యువ సంగ్రామ సదస్సు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. యువత పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. స్టేడియం పరిశీలనలో ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, నోముల భగత్, బంటి, అవినాష్ రెడ్డి, ముఠా జైసింహా, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, బాలరాజు యాదవ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిషోర్ గౌడ్, మాజీ ఎస్సీ కమిషన్ సభ్యుడు విద్యాసాగర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా. కురువ విజయ్ కుమార్, ధర్మేందర్ రెడ్డి, తుంగబాలు, కాదరి స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మాపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం

**--ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చూస్తున్నారు.**

**--మా వ్యాపారాలకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకోం.**

**--విలేకరుల సమావేశంలో స్వర్ణకారుల వెల్లడి.**



తాండూరు, జులై 14 (విజన్ ఆంధ్ర):మాపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మా వ్యాపారాలకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్వర్ణకారులు పేర్కొన్నారు. పట్టణంలో జిపి జ్యువెలర్స్ ,పవన్ జ్యువెలర్స్, మహాలక్ష్మి జువెలర్స్ స్వర్ణకారులు నేడు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈరోజు టిప్పు అనే వ్యక్తి మా పై చేసిన ఆరోపణలు ఏవైతే ఉన్నాయో వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మాపై తాండూర్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారని టిప్పు అనే వ్యక్తి 24 క్యారెట్ల బంగారాన్ని 20 క్యారెట్ల వరకే ఇచ్చారని తప్పుడు ఆరోపణలు చేశారని వాస్తవంగా ఏదైతే చిన్న వస్తువు కొంటామో దానికి 18 లేదా 20 క్యారెట్ల వరకే బంగారు అనేది వస్తుందని దాంట్లో ఎటువంటి సందేహం లేదని అన్నారు. ఈ విషయాన్ని అనవసరంగా ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఆ వ్యక్తి మాపైన ఆరోపణలు చేసి మా యొక్క వ్యాపారానికి భంగం కలిగించడమే కాకుండా ,మా పరువు తీసే ప్రయత్నం చేశాడని ఆరోపించారు.మేము కొన్ని ఏళ్ల సంవత్సరాల నుంచి బంగారు షాపులు నిర్వహిస్తున్నామని ఇప్పటివరకు లేని వదంతులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు.ఈ విషయమై తాము కూడా జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇంకా మమ్మల్ని టార్గెట్ చేస్తే షాపులను బంద్ చేసి నిరసన వ్యక్తం చేస్తామని వెల్లడించారు.



## ఆపదలో ఉన్నవారికి అపర్ణ హస్తం

బూర్గంపాడు మండల ప్రతినిధి జూలై 14 (విజన్ ఆంధ్ర ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామపంచాయతీలో బసప్ప క్యాంపులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎస్.కె. లఫ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్యాన్సర్ బాధ్యత కుటుంబానికి కుటుంబానికి 10,000 ఆర్థిక సహాయం, సారపాక: సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండే ఎస్.కె. లఫ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహించబడుతున్న ITC PSPD United Muslims Association ఆధ్వర్యంలో క్యాన్సర్ చివరి దశలో చికిత్స పొందుతున్న ఎస్.కె రిహానా కుటుంబానికి శనివారం ?10,000 ఆర్థిక సహాయం అందజేశారు. సారపాకలోని బసవప్ప క్యాంప్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించి తమ సంఘీభావాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అవసరంలో ఉన్న కుటుంబాలకు చేయూత అందించడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కార్మిక మైనారిటీ నాయకులు నాగుర్ వలి, లాల్ మెహ్మూద్, మెహబూబ్ అలీ, అజీజ్, బషారత్, అజీమ్, నషీర్, మెహబూబ్ ఖాన్ పాల్గొని బాధిత కుటుంబానికి ఆర్థిక వారి చేతుల మీ దగ్గర సాయాన్ని అందజేశారు

## ఆర్. కృష్ణయ్య సత్యాగ్రహ దీక్షకు

### సంఘీభావం తెలిపిన తాండూరు బిసి నాయకులు

తాండూరు, జులై 14(విజన్ ఆంధ్ర): బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా తాండూర్ నియోజకవర్గం నుంచి బీసీ ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, బీసీ సంఘం నాయకులు హైదరాబాద్‌కు చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీసీల విద్యా, సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా బీసీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, స్కాలర్‌షిప్‌లను పెంచాలని, బీసీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, విద్యార్థులకు మెరుగైన వసతి, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. బీసీల హక్కుల సాధన కోసం శ్రీ ఆర్. కృష్ణయ్య చేపట్టిన ఈ సత్యాగ్రహ దీక్ష విజయవంతం కావాలని, బీసీ సమాజం ఐక్యంగా పోరాడితేనే హక్కులు సాధ్యమవుతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ షకూర్, బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు అనిత, మంజుల, నర్సమ్మ, పరమేష్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బాషు, వివేక్, కిరణ్, యాసర్, అరుణ్, రాకేష్, రాజేష్ పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డిపై కొడంగల్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

కొడంగల్, జులై14(విజన్ ఆంధ్ర ) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం మరియు రైతులపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం కొడంగల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సత్యనారాయణ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దామోదర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏరన్ పల్లి శ్రీనివాస్ లు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబం మరియు రైతులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై వెంటనే కేసు నమోదు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తలారి మల్లేష్ ముదిరాజ్,గుండ్లకుంట బాలరాజ్, ఏర్పుల మోహన్, మహమ్మద్ రఫీ,




గౌరీ శంకర్, జగన్మోహన్,మాజీ సర్పంచ్ అంజి, వెంకట్ రెడ్డి,లక్ష్మిపల్లి వెంకటయ్య,అప్పు, ఇర్ఫాన్ భాస్కర్,తలారి వెంకట్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ నగర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



**-మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హామీ**

**-మాజీ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన రాజీవ్ గాంధీ నగర్ నూతన కమిటీ సభ్యులు**

**-నూతన అధ్యక్షుడు అజయ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపిన కూన శ్రీశైలం గౌడ్**

**-కాలనీలోని ప్రజా సమస్యలను వివరించిన కమిటీ ప్రతినిధులు**

**-అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసా**

కుత్బుల్లాపూర్, జూలై 14 (విజన్ ఆంధ్ర) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్ నగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ నూతన కమిటీ సభ్యులు స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ నగర్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అజయ్ కుమార్ ని మాజీ ఎమ్మెల్యే అభినందించి, శాలువాతో సత్కరించిన కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అజయ్ కుమార్ మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ నగర్ కాలనీలో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలకు సంబంధించిన పలు సమస్యలు నెలకొన్నాయని మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే తనకు ఎప్పుడూ ప్రాధాన్యమని పేర్కొన్నారు. కాలనీలో ఉన్న సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ నగర్ కమిటీ సభ్యులు సంపత్ రెడ్డి, అశోక్, వేణుగోపాల్, మహిపాల్ రెడ్డి, వెంకటేష్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీ ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే సూచించారు.

# దక్షిణాది 'బాహుబలి మైన్'గా 'తాడిచర్ల బ్లాక్-2'

**సింగరేణి చరిత్రలోనే సరికొత్త అధ్యాయం!**

**కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి**

**350 మిలియన్ టన్నుల భారీ బొగ్గు నిల్వలు**

**50 ఏళ్ల పాటు నిరంతరాయంగా ఉత్పత్తి**

మల్హర్, జూలై 14 విజన్ ఆంధ్ర : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండల పరిధిలోని బొగ్గు గనుల చరిత్రలో సరికొత్త అధ్యాయం లిఖించబడుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సింగరేణి చరిత్రలోనే అత్యంత భారీ గనిగా అవతరించబోతున్న 'తాడిచర్ల కోల్‌బ్లాక్-2' రాబోయే రోజుల్లో మొత్తం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకే ఒక మణిహారంగా నిలవనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తాడిచర్లలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటూ, ఎలాంటి వేలం విధానం లేకుండా ఈ గనిని నేరుగా సింగరేణికే కేటాయించిందని మంత్రి వెల్లడించారు. ఈ తాడిచర్ల కోల్‌బ్లాక్-2 గనిలో దాదాపు 350 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు అంచనా వేశామని, దీని ద్వారా రాబోయే 40 నుండి 50 సంవత్సరాల పాటు నిరంతరాయంగా బొగ్గు ఉత్పత్తి కొనసాగుతుందని వివరించారు. దక్షిణ భారతదేశంలోనే అత్యంత పెద్దది కావడంతో దీనిని 'బాహుబలి కోల్ మైన్' గా పిలవవచ్చన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా



సుమారు రూ. 1.20 లక్షల కోట్ల టర్నోవర్, అలాగే రూ. 50 వేల కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ గని ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, సుమారు 2000 మందికి ప్రత్యక్షంగా, 5000 మందికి పరోక్షంగా ఉపాధి దొరుకుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ పనులను వేగంగా ప్రారంభించేందుకు అవసరమైన అన్ని రకాల పూర్తి అనుమతులను కేంద్ర ప్రభుత్వం త్వరలోనే మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ అలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాకేష్ రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ మంత్రి సీతారాం నాయక్ మరియు రాష్ట్ర నాయకులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, చల్లా నారాయణ రెడ్డి, చంద్రుపట్ల కీర్తి రెడ్డి, గోమాస శ్రీనివాస్ స్థానిక మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ వీరభద్ర స్వామి చండీ హోమం



భీమదేవరపల్లి జూలై 14 (విజన్ ఆంధ్ర): దేవదాయ ధర్మాదాయ శాఖ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం కొత్తకొండ గ్రామము మండలం భీమదేవరపల్లి జిల్లా హనుమకొండ నందు ఈరోజు అమావాస్య సందర్భంగా ప్రతి నెల నిర్వహించే చండీ హోమం నిర్వహించడం జరిగినది. తదనంతరం అన్న ప్రసాదం కార్యక్రమం కూడా నిర్వహించడం జరిగినది ఇట్టి కార్యక్రమంలో భక్తులు గ్రామ ప్రజలు పెద్దలు అర్చకులు మరియు సిబ్బంది పాల్గొనడం జరిగింది ఈవో కిషన్ రావు తెలిపారు

## కబ్జాకు గురవుతున్న కుమ్మరి కుంట రక్షణ చర్యలు చేపట్టాలి



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 14 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని కుమ్మరి కుంట కబ్జాకు గురవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మహమ్మదాపూర్ రోడ్ లోని చిన్న కుమ్మరి కుంట సర్వే నెంబర్ 81 విస్తీర్ణం ఒక ఎకరం 12 గుంటలు అయితే కొంతకాలంగా కొంతమంది వ్యక్తులు కుమ్మరి కుంటను ఆక్రమించి వ్యవసాయం చేసుకుంటున్నారని అయితే ఇప్పుడు వర్షాలు లేకపోవడముతో కుంట పూడిక తీసి నీరు నిల్వ చేసేందుకు మట్టి తీస్తామంటే తీయకుండా కొంతమంది అడ్డుపడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారులు కూడా దాదాపు 2023 నుంచి కుంట కబ్జా అవుతుందని ఎన్నిసార్లు ఫిర్యాదులు ఇచ్చిన హద్దులు ఏర్పాటు చేసారు కాని సూచిక బోర్డును కుంట విస్తీర్ణం బోర్డు ఏర్పాటును చేయలేదు. దాని ద్వారా కొందరు కుంటను కూడా ఆక్రమించి వ్యవసాయం చేసుకుంటున్నారని రైతులు తెలిపారు. కుంటను వెడల్పుగా తీయడం ద్వారా నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు.

చుట్టూపక్కల రైతులు ఎన్ని బోర్లు వేసినా కనీసం చుక్క నీరు కూడా రావడంలేదని కుంటను పూడిక తీయడం వల్ల నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు పెరుగుతాయని అధికారులకు చెబుతున్న వారు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుంట పూడిక తీసి రైతుల భూగర్భజలాలు పెంచే విధంగా చర్యలు చేపట్టాలని కుంట భూమిని ప్రైవేటుపరం కాకుండా తగు రక్షణ చర్యలు చేపట్టాలని కుంటను పూడిక తీసేందుకు అనుమతి ఇవ్వాలని రైతులుకోరుతున్నారు.

## బాలవికాస్ - కాఫేడు సంస్థల సహకారంతో ముత్తారం, సూరవీడు కాలనీలలో

# నూతన బోర్‌వెల్స్ ప్రారంభం

వెంకటాపురం, జూలై 14( విజన్ ఆంధ్ర) : గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో బాలవికాస్ సంస్థ మరియు కాపెడ్ సంస్థల సంయుక్త సహకారంతో వెంకటాపురం మండల పరిధిలోని ముత్తారం , సూరవీడు కాలనీలో నూతన బోర్‌వెల్స్ ఏర్పాటు చేసి ప్రారంభించారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముత్తారం గ్రామ సర్పంచ్, కార్యదర్శి, సూరవీడు కాలనీ గ్రామ సర్పంచ్,ఉపసర్పంచ్, గ్రామ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. బాలవికాస్ సంస్థ తరఫున ప్రశాంత్ , కాపెడ్ సంస్థ తరఫున డైరెక్టర్ బ్రదర్ కె. లూర్దు రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా కరువు పరిస్థితుల్లో స్వచ్ఛమైన తాగునీరు ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండటం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బాలవికాస్ సంస్థ సహకారంతో ఈ బోర్‌వెల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామ ప్రజలు ఈ బోర్‌వెల్స్‌ను తమ సొంత ఆస్తిగా భావించి, వాటిని జాగ్రత్తగా వినియోగించుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా



సంరక్షించాలని సూచించారు.

ముత్తారం గ్రామం మరియు సూరవీడు కాలనీ ప్రజలు ఈ బోర్‌వెల్స్ ఏర్పాటు చేయడం వల్ల తమ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ క్లిష్టమైన కరువు సమయంలో తమ గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించిన బాలవికాస్ సంస్థ మరియు క్యాఫెడ్ సంస్థలకు గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రజల సంక్షేమం, తాగునీటి భద్రత మరియు సమాజాభివృద్ధి కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

# ఎస్ఐఆర్ సమావేశంలో రచ్చ

### సర్పంచ్ ఫొటో వివాదంతో వాగ్వాదం

### నిరసనలతో ఉద్రిక్తత

బెల్లంపల్లి జూలై 14 విజన్ ఆంధ్ర : తాండూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ బీసీ కమిటీ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) అవగాహన కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎల్ఏలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరును జాబితాలో నమోదు చేయడంతో పాటు సవరణ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు.

సర్పంచ్ ప్రోటోకాల్ వివాదం

అయితే కార్యక్రమం మధ్యలో సర్పంచ్ ఫొటో వివాదం చెలరేగింది. సభ కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తాండూర్ గ్రామ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ ఫొటో లేకపోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం



వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ ప్రకారం తన ఫొటో ఉండాల్సిందని, ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టారని ఆరోపించారు. ఈ అంశంపై డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డితో వాగ్వాదం చోటుచేసుకుంది. సర్పంచ్‌కు మద్దతుగా ఆయన అనుచరులు, స్థానిక నాయకులు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

దళిత సర్పంచ్‌ను కావాలనే అవమానించారని ఆరోపించారు. బాధ్యులు రాజీనామా చేయాలని డిమాండ్ చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం పెద్దల జోక్యంతో వివాదం సద్దుమణగగా కార్యక్రమం కొనసాగింది.

## లక్కారం చౌక ధరల దుకాణంలో ఓటరు జాబితాపై అవగాహన కార్యక్రమం

ఉట్నూర్, జూలై 14, (విజన్ ఆంధ్ర) : ఉట్నూర్ మండలం లక్కారం గ్రామంలోని చౌక ధరల దుకాణంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ చంచలబాయి తో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, పద్మ పాల్గొని గ్రామస్థులకు ఓటరు జాబితాలో పేర్ల నమోదు, సవరణలు, మార్పులు, తొలగింపులకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే నమోదైన వారు తమ వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని గ్రామస్థులకు సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరు జాబితాను సరిచేసుకోవాలని కోరారు.

# సీఎం సహాయనిధితో పేద కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక చేయూత

- జగద్గిరి నగర్‌కు చెందిన మహిళ చికిత్స కోసం మంజూరు
- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చొరవతో అందిన సహాయం
- పేదల ఆరోగ్య అవసరాలకు సీఎం రిలీఫ్ ఫండ్‌ను వినియోగిస్తున్న సీపీఐ
- రెండేళ్లలో కుత్బుల్లాపూర్‌లో పలువురికి లబ్ధి చేకూరిందన్న ఉమామహేష్

కుత్బుల్లాపూర్, జులై 14 (విజన్ ఆంధ్ర); పేద ప్రజలకు వైద్య చికిత్స భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో ఉపయోగపడుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్‌లోని జగద్గిరి నగర్‌కు చెందిన కావలి బాబు సతీమణి తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సహాయం సీపీఐ ఎమ్మెల్యే, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు చొరవతో అందిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సహకరించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు, సీపీఐ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ, పేద ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని చెప్పారు. గత రెండేళ్లుగా జగద్గిరిగుట్ట డివిజన్‌తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అనేక మంది నిరుపేదలకు సీఎం సహాయనిధి ద్వారా వైద్య చికిత్స కోసం ఆర్థిక సాయం అందేలా కృషి



చేశామని తెలిపారు. ఈ సహాయం ద్వారా లబ్ధి పొందిన ప్రజలు పార్టీపై విశ్వాసం వ్యక్తం చేస్తుండటం సంతోషకరమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ ప్రధాన ధ్యేయమని, ప్రజలు కూడా పార్టీ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు మద్దతు తెలుపుతూ సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి రాములు, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, యువజన సంఘం కార్యదర్శి వెంకటేష్, శాఖ నాయకులు చంద్రయ్య, కరుణాకర్, బాలకృష్ణ, చంద్రమ్మతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరు ఎస్ ఐ ఆర్ ఫారాన్ని బి ఎల్ ఓ లకు అందజేయాలి

## సంగారెడ్డి బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు కోణం విట్టల్

పెద్ద శంకరంపేట్, జులై 14: విజన్ ఆంధ్ర:పెద్ద శంకరంపేట్.ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ యొక్క ఎస్ ఐ ఆర్ ఫారాన్ని పూర్తిచేసి సంబంధిత బి.ఎల్.ఓ లకు అందజేయాలని సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు కోణం విట్టల్ పేర్కొన్నారు.. మంగళవారం పెద్ద శంకరంపేటలోని బిజెపి కార్యాలయంలో మండల స్థాయి లో పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 24వ తేదీ లోపు తప్పనిసరిగా ప్రతి ఓటర్ కు సంబంధించిన ఎస్ ఐ ఆర్ ఎన్ని మేటర్ ఫారాలను పూర్తిగా నింపి ఆయా పోలింగ్ కేంద్రాల లోని బూత్ స్థాయి అధికారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణ. బిజెవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ.. నాయకులు వెంకయ్య. ధ్రువ కుమార్ తదితరులు పాల్గొన్నారు...

# సర్ ప్రక్రియ ను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు...



బోధన్, జులై 14(విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ?ప్రభుత్వ ఆదేశాల మేరకు కాంగ్రెస్ శ్రేణులు పట్టణంలో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో బూత్ లను పట్టణ కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. జాబితాలో ఉండే డూప్లికేట్ ఓట్లను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని బిఎల్ఏ లకు సూచించారు. ఓటరు జాబితా సవరణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి పార్టీ శ్రేణులు అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని తెలిపారు. గడువులోపు సర్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాము, మాజీ అధ్యక్షులు పాషా, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నవీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# బోధన్ నియోజకవర్గంలో ఎల్నినో సెగ...

## వర్షాభావంతో ఎండుతున్న పంటపొలాలు..

### ఆందోళనలో రైతాంగం..

బోధన్,జులై14 (విజన్ ఆంధ్ర) : బోధన్ నియోజకవర్గంలో ఎల్నినో ప్రభావం తీవ్ర రూపం దాల్చింది. రుతుపవనాలు మొఖం చాటేయడం, ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో నియోజకవర్గంలోని వేలాది ఎకరాల్లో పంట పొలాలు ఎండిపోతున్నాయి. వర్షాకాలం మొదలై నెల గడిచినా చెరువులు, కుంటల్లో చుక్క నీరు చేరకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో కొద్ది మంది రైతులు దుక్కి దున్ని నాటు కోసం ఎదురు చూస్తున్నారు. వేసిన కొద్ది నాట్లు నీరు లేక ఎండిపోతున్నాయి. ?సాధారణంగా ఈ పాటికే బోధన్, ఎడపల్లి, రెంజల్, నవీపేట్, సాలూర మండలాలలో వరి నాట్లు ముమ్మరంగా సాగాల్సి ఉంది. కానీ, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల సాగు నీరు అందక వేసిన నాట్లు సైతం ఎండిపోతున్నాయి. భూములు నెర్రెలు బారుతుండటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు భారీగా పడిపోయాయి. గతంలో నిరంతరాయంగా నీరు పోసిన బోరుబావులు ఎత్తిపోస్తున్నాయి. ప్రధాన పంట వరిసాగుపై ఎల్నినో కోలుకోలేని దెబ్బ తీసింది. వర్షాలు కురవక పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని భగవంతుణ్ణి రైతులు వేడుకుంటున్నారు.

# విద్యార్థులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వ వైఖరి మారాలి

## - ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్
## - స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి



చేవెళ్ల, జూలై 14 (విజన్ ఆంధ్ర): రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏబీవీపీ తెలంగాణ శాఖ పిలుపు మేరకు చేవెళ్ల మండలంలోని అన్ని కళాశాలల్లో బంద్ విజయవంతంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్ ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదని, రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కులో భాగంగా విద్యార్థులకు అందాల్సిన హక్కు అని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడకుండా వెంటనే పెండింగ్ బకాయిలన్నీ విడుదల చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు..ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేసి విద్యార్థుల హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వివేకానంద, శివ, లోకేష్, జైపాల్, మల్లేష్, కార్తీక్, యశ్వంత్, మణి, నాని , సన్నీ, ఫెరోద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎఫ్ఐడబ్ల్యూతో మహిళల హక్కుల కోసం నిరంతర పోరాటం: వడ్ల మంజుల



చేవెళ్ల, జూలై 14 (విజన్ ఆంధ్ర): సమాజంలో మహిళలపై జరుగుతున్న వివక్షకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతూ... వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షురాలు వడ్ల మంజుల అన్నారు. రాజేంద్రనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా మహాసభల్లో ఆమెను జిల్లా అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగన్న, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కే. రామస్వామి, జిల్లా నాయకత్వానికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సమాఖ్యను మరింత బలోపేతం చేస్తానని ఆమె పేర్కొన్నారు.

# తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే కాంగ్రెస్ వైఫల్యాలపై కమలం పోరు



మల్యాల, జూలై 14 (విజన్ ఆంధ్ర): రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో సంక్షేమం శూన్యమని, రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెరక శ్రవణ్ ధీమా వ్యక్తం చేశారు. మల్యాల మండల బీజేపీ అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో రామన్నపేట ఏఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మండల కార్యవర్గ సమావేశం జరిగింది.

?ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఓటర్ల సవరణ ప్రోగ్రామ్‌ను ప్రతి బూత్‌లో విజయవంతం చేయాలన్నారు. రేపటి నుండి మూడు రోజుల పాటు గ్రామాల్లో నిర్వహించే 'స్పెషల్ డ్రైవ్' ద్వారా కొత్త ఓటర్ల నమోదు, మార్పుల ప్రక్రియను వేగవంతం చేయాలని, ఓటర్లకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని కేడర్‌కు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సర్పంచులు తిరుపతి, నడిపి మల్లేశం, వక్కలభరణం మౌర్య, చీకట్ల లత, సీనియర్ నాయకులు బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, బోట్ల ప్రసాద్, కొల్లూరి గంగాధర్ పాల్గొన్నారు.

?వీరితో పాటు ప్రధాన కార్యదర్శులు పొన్నం సాయికుమార్, పిల్లి రాజశేఖర్, బీజేవైఎం మండలాధ్యక్షుడు పొనుగంటి గౌతమ్ కుమార్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు టైటాస్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బొమ్మన పరమేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు సామ మైపాల్ రెడ్డి, వార్డు మెంబర్లు, బూత్ అధ్యక్షులు, బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

## ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్ల, జూలై 13 (విజన్ ఆంధ్ర): ప్రభుత్వం కేటాయిస్తున్న ప్రతి రూపాయి అభివృద్ధి నిధిని సద్వినియోగం చేసుకుంటూ చేవెళ్ల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని పామెన వార్డులో కౌన్సిలర్ గోపాల్ రెడ్డి తన సొంత నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించిన ఆయన, మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని, గోపాల్ రెడ్డి సొంత నిధులతో బీటీ రోడ్డు నిర్మించడం ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. మున్సిపాలిటీలో అంతర్గత రహదారులు, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని, మహిళల సాధికారత కోసం ఇందిరా మహిళా భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. రానున్న రోజుల్లో చేవెళ్లను మరింత సుందరంగా, సకల సదుపాయాలతో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కౌన్సిలర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సహకారంతో వార్డు అభివృద్ధికి మరిన్ని పనులు చేపడతానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల స్థలంపై కబ్జా యత్నం



## రాత్రికి రాత్రే ట్రాక్టర్లు, జేసీబీలతో చదును చేశారంటూ ఆరోపణలు

## ఖండించిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, జూలై 14 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ శివారులో జర్నలిస్టులకు కేటాయించిన స్థలం కబ్జా యత్నం జరిగిందంటూ తీవ్ర వివాదం నెలకొంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జర్నలిస్టులకు ఈ స్థలాన్ని కేటాయించి భూమి పూజ నిర్వహించి కొబ్బరికాయ కొట్టారు. అయితే ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో స్థలం అంశం పెండింగ్‌లోనే ఉండిపోయింది. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు రియల్ ఎస్టేట్ మాఫియా జర్నలిస్టుల స్థలంపై కన్నేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. శనివారం, ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ఉండటాన్ని అవకాశంగా తీసుకుని రాత్రికి రాత్రే ట్రాక్టర్లు, జేసీబీలతో భూమిని చదును చేసి కబ్జా చేసేందుకు ప్రయత్నించారని జర్నలిస్టులు ఆరోపించారు. విషయం వెలుగులోకి రావడంతో జర్నలిస్టులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మంగళవారం స్పందించిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించేందుకు చేసే ఏ ప్రయత్నాన్నైనా తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. జర్నలిస్టుల భూమిని కబ్జా చేయాలనే ప్రయత్నాలను ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు వెంటనే అడ్డుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని యథాతథంగా పరిరక్షించి, పూర్తి హక్కులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



## గాదెపాడు బస్సు అదనపు ట్రిప్పుకై సర్పంచ్ రంజిత్ కుమార్ వినతి

కారేపల్లి,జులై 14(విజన్ ఆంధ్ర) : సింగరేణి మండలం గాదెపాడు బస్సు అదనపు ట్రిప్పు నడపాలని కోరుతూ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు,గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం బస్ డిపో మేనేజర్ కార్యాలయంలో సూపరిండెంట్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు గాదెపాడుకు ఉదయం, సాయంత్రం మాత్రమే వస్తోందని తెలిపారు. అయితే మధ్యాహ్నం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని,మధ్యాహ్నం కూడా ఒక ట్రిప్ వేయాలని సూపరిండెంట్ కు వినతిపత్రం ఇవ్వగా సానుకూలంగా స్పందించి, డిపో మేనేజర్ శివప్రసాద్ కు వివరించి,త్వరలోనే బస్సు అదనపు ట్రిప్పు వేసే విధంగా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రబోడు,మాణిక్యారం,టేకులగూడెం,గుట్ట కింద గుంపు గ్రామాల సర్పంచులు ఈసాల అలివేలు మంగ నాగేశ్వరరావు,భూక్య పద్మావాచ్యా, గుమ్మడి సందీప్,ఉండం రాఘవులు,తదితరులు పాల్గొన్నారు.

# వెనక్కి తగ్గేది లేదు... పోరాటం ఆగేది లేదు: ఎస్ఎఫ్ఐ

- విద్యార్థి ఉద్యమాలను అణచివేయడం సరికాదు
- ముందస్తు అరెస్టులతో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారు: చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్

చేవెళ్ల, జూలై 14 (విజన్ ఆంధ్ర): విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా చేపట్టిన ఉద్యమాలను ముందస్తు అరెస్టులు, నిర్బంధాలతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆరోపించారు. మంగళవారం చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి వెళ్లకుండా తనను తెల్లవారుజామునే ముందస్తుగా అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్బంధ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఉద్యమాలను అణచివేసే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. విద్యార్థి నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఎస్ఎఫ్ఐ పోరాటం మరింత ఉధృతంగా



కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్బంధ రాజకీయాలను వీడి విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, వసతి గృహాలు, విద్యా సదుపాయాలకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులు, అక్రమ అరెస్టులు ఎదురైనా వెనక్కి తగ్గేదే లేదని, ప్రజాస్వామ్య పద్ధతుల్లో విద్యార్థుల హక్కుల సాధన కోసం తమ ఉద్యమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## ఎండోమెంట్ సెల్ రాష్ట్ర కన్వీనర్ పదవీకాలం ఏడాది పూర్తి సందర్భంగా ప్రత్యేక పూజలు

చేవెళ్ల, జూలై 14 (విజన్ ఆంధ్ర): హిందూ ధర్మ పరిరక్షణ, దేవాలయాల అభివృద్ధి కోసం భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ సెల్ నిరంతరం కృషి చేస్తోంది అని బీజేపీ ఎండోమెంట్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ కేశపల్లి వెంకట్ రాంరెడ్డి అన్నారు. మంగళవారం ఎండోమెంట్ సెల్ రాష్ట్ర కన్వీనర్ అన్నవజ్జుల సూర్యప్రకాశ్ పదవీకాలం ఏడాది పూర్తి సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి, కొమురవెల్లి శ్రీ మల్లికార్జున (మల్లన్న) స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం కేశపల్లి వెంకట్ రాంరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. దేవాలయాల పరిరక్షణ, హిందూ ధర్మ ప్రచారం, భక్తుల సేవలో ఎండోమెంట్ సెల్ మరింత అంకితభావంతో పనిచేస్తుందని పేర్కొన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ సమాజానికి సేవ చేయడమే తమ లక్ష్యమని అన్నారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండన్నగారి వెంకట్ రెడ్డి, తిరుపతిరెడ్డి, బర్ల కృష్ణ, మధుసూదన్ రెడ్డి, ఉమాశంకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణ, మాణిక్ రెడ్డి, సందీప్ గౌడ్, ధనుష్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

# డిజిటలైజేషన్ ను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

డిజిటలైజేషన్ ను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ. పరిగి, జూలై 14(విజన్ ఆంధ్ర ):ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ ను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. మంగళవారం పరిగి నియోజకవర్గం చౌడాపూర్ మండలంలో తహసిల్దార్ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొత్తపల్లిలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల, మరికల్ గ్రామంలో ఆయిల్ ఫామ్ పంట సాగును జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ఆకస్మిక పర్యటన గావించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునే విధంగా బిఎల్ఓ లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి తీసుకునే క్రమంలో ఫారాలు పూరించడంలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత బిఎల్ఓ లపై ఉందని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ప్రాథమిక



ఆరోగ్య కేంద్రంలో నాణ్యమైన వైద్యాన్ని అందించాలని అదేవిధంగా మందులు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని కలెక్టర్ వైద్యాధికారి సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొత్తపల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల విద్యా బోధనను పరిశీలించారు. విద్యార్థుల పడక గదులను, టాయిలెట్లు, మధ్యాహ్న భోజన వంటకాలను కలెక్టర్ పరిశీలించారు. నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేశారు. మరికల్ గ్రామంలో ఆయిల్ ఫామ్ సాగును పరిశీలించారు. ఆయిల్ ఫామ్ సాగు అధిక లాభాలు ఉంటాయని, ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుకు పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు. కలెక్టర్ తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జెడ్పి సీఈఓ సుదీర్, డిఎంహెచ్ఓ సుధాకర్ లాల్ లు తదితరులు పాల్గొన్నారు.



## ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్యేచే నియామక పత్రాలు అందజేత

కారేపల్లి,జులై 14(విజన్ ఆంధ్ర): ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేస్తూ ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు ఆయాలకు ఎమ్మెల్యే సూచించారు.మండలంలోని ప్రీ ప్రైమరీ పాఠశాలలకు నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు,ఆయాలకు మంగళవారం నియామక పత్రాలను ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చేతుల మీదగా అందజేశారు.విశ్వనాథపల్లి, పేరేపల్లి,టేకులగూడెం గ్రామాల్లోని ప్రీ ప్రైమరీ పాఠశాలలకు ఈ నియామకాలు జరిగాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించడంలో ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.విధులకు సక్రమంగా హాజరవుతూ,చిన్నారులకు అర్థమయ్యేలా బోధన సాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు,కారేపల్లి సర్పంచ్ మేదరి టోనీ,బీసీ సెల్ నాయకులు బోళ్ళ రమేష్,కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి,కిసాన్ సెల్ నాయకులు కడియాల సుధాకర్,జిల్లా తదితరులు పాల్గొన్నారు.

## కెప్టెన్ చౌడు తండాలో శీతల భవాని వేడుకలు

అక్కన్నపేట జూలై : 14 విజన్ ఆంధ్ర అక్కన్నపేట మండలం కెప్టెన్ చౌడు తండా గ్రామపంచాయతీ పరిధిలోని బోధర్ వాగు తండాలో గిరిజనుల ఆరాధ్య దైవమైన శీతల భవాని పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వరూపరాజు నాయక్ మాట్లాడుతూ గిరిజనుల సాంప్రదాయం ప్రకారం ప్రతి సంవత్సరం జూలై నెలలో పెద్ద పూసల కార్తెలో శీతల భవాని పండుగను నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. ఏడుగురు భవాని మాతలను కొలుస్తూ సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు బాగా పండాలని, పశుసంపద వృద్ధి చెందాలని, తండా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటూ ఈ పండుగను సాంప్రదాయబద్ధంగా జరుపుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా కెప్టెన్ చౌడు తండా ప్రజలందరికీ శీతల భవాని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తండా పెద్దలు, తండా నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మధిర శ్రీమతి రేణుక చౌదరి గారి క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

### మాజీ కేంద్ర మంత్రివర్యులు, రాజ్యసభ సభ్యురాలు శ్రీమతి రేణుకా చౌదరి గారి ముఖ్య అనుచరుడు జవ్వాజి ఆనందరావు ఆధ్వర్యంలో 475000/- రూపాయల చెక్కులు పంపిణీ

మాజీ కేంద్ర మంత్రివర్యులు, రాజ్యసభ సభ్యురాలు శ్రీమతి రేణుకా చౌదరి గారి ముఖ్య అనుచరుడు జవ్వాజి ఆనందరావు ఆధ్వర్యంలో 475000/- రూపాయల చెక్కులు పంపిణీ

మాజీ కేంద్ర మంత్రివర్యులు రాజ్యసభ సభ్యురాలు శ్రీమతి రేణుక చౌదరి గారి సహకారంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరావు సిఫారసు తో చెక్కుల మంజూరు

అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధిద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని(చెక్కులు) పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు జవ్వాజి ఆనందరావుడ మిత్ర బృందం.ప్రజా ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు ఆసరాగా నిలుస్తోందని జవ్వాజి ఆనందరావు అన్నారు. రేణుక చౌదరి గారి క్యాంప్ కార్యాలయంలో లిరూ. 70,000 విలువైన 2 చెక్కులులి మరియు లి4000000లి ఎల్ఓసి మంజూరు చేయడం జరిగింది1) కొండల వెంకటలక్ష్మి ఇల్లూరు-రూ 35,000/-2) వరదబోయిన వెంకటకృష్ణ ఇల్లూరు - రూ 35000/-3) షేక్ నన్నే సాహెబ్ ఇల్లూరు - రూ 400000/- రూజాఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రివర్యులు లిశ్రీ రేవంత్ రెడ్డిలి గారికి, మాజీ కేంద్ర మంత్రివర్యులు లిశ్రీమతి రేణుక చౌదరిలి గారికి వ్యవసాయ శాఖ మంత్రివర్యులు లిశ్రీ తుమ్మల నాగేశ్వరరావులి గారికి కృతజ్ఞతలు తెలిపినారు ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి కర్లపూడి అప్పారావు, మధిర మండల నాయకులు ఆవుల గురుబ్రహ్మం, జల్లేపల్లి ప్రసాద్, బాధ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వర్షాలకు దెబ్బతిన్న మిషన్ భగీరథ పైప్‌లైన్

### త్రాగు నీరు లేక గిరిజన కుటుంబాల అవస్థలు

### సర్పంచ్ శంకర్ నాయక్ చొరవతో పైప్ లైన్ మరమ్మతులు

జన్నారం, జులై 14 (విజన్ ఆంధ్ర) : మిషన్ భగీర థ తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గిరిజన గ్రా మ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీ వల కురిసిన వర్షాల కారణంగా జన్నారం మండ లంలోని లోతొర్రె గ్రామ గిరిజనులకు సరఫరా అ య్యే మిషన్ భగీరథ పైప్‌లైన్ దెబ్బతినడంతో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో గ్రామస్థు లకు త్రాగునీటి కష్టాలు మొదలయ్యాయి.ఈ సమ స్యను గుర్తించిన ఆ గ్రామ సర్పంచ్ బోడ శంకర్ నా యక్ స్పందించి సంబంధిత అధికారులతో మాట్లా డి మంగళవారంరోజున పైప్‌లైన్ మరమ్మతు పను లను చేయించారు. దెబ్బతిన్న పైపులను మార్చి లీ కేజీలను సరిచేయడంతో మిషన్ భగీరథ నీటి సర ఫరా తిరిగి ప్రారంభమైంది.నీటి సరఫరా పునరుద్ధ రణతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న గిరిజన కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నాయి. స ర్పంచ్ చొరవతో సమస్యను పరిష్కరించినందుకు గ్రామ ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా మిషన్ భగీరథ పైప్‌లైన్ ను శాశ్వతంగా బలోపేతం చేయాలని, దెబ్బతిన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకో వాలని అధికారులను కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉంటే ప్రజలు ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో మెషిన్ భగీరథ సూపర్వైజర్ సంతోష్, ఆపరేట ర్ మజర్ తదితరులు ఉన్నారు.



# ప్రయాణికుల అవస్థలు

### భద్రాచలం-వెంకటాపురం రూట్‌లో బస్సుల కొరత

### - గంట ప్రయాణం కాస్త ఎటు వెళ్ళిన రెండు గంటల ప్రయాణం

చర్ల, జులై 14 (విజన్ ఆంధ్ర): భద్రాచలం నుండి చర్ల మీదుగా వెంకటాపురం వరకు సాగే ప్రయాణం నిత్యం వేలాది మందికి జీవనాధారం కానీ, ప్రస్తుతం ఈ మార్గంలో బస్సుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, ఒకప్పుడు పదిహేనుకు పైగా సర్వీసులు అందుబాటులో ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య ఏడుకు పడిపోవడం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది

**తగ్గిన సర్వీసులు – పెరిగిన కష్టాలు**

గతంలో ఉన్న బస్సు సర్వీసులతో పోలిస్తే ప్రస్తుతం సర్వీసుల సంఖ్య సగానికి పైగా తగ్గిపోయింది, ఫలితంగా బస్టాండ్లలో ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది, నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో బస్సులు సరిపడా లేకపోవడంతో, ఉన్న బస్సుల్లోనే జనం కిక్కిరిసి ప్రయాణించాల్సి వస్తోంది , సీటు దొరకడం మాట అటుంచి, కనీసం నిలబడటానికి కూడా స్థలం లేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు

**వాగ్వాదాలకు దారితీస్తున్న రద్దీ**

బస్సుల రాకలో జాప్యం, రద్దీ పెరగడం వల్ల ప్రయాణికుల మధ్య తరచుగా వాగ్వాదాలు, చిన్నపాటి ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి, అత్యవసర పనుల మీద వెళ్లేవారు, ఆసుపత్రులకు వెళ్లే రోగులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటికీ, అసలు సమయానికి బస్సులు లేకపోవడం వల్ల ఆ సౌకర్యం తమకు శాపంగా మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

**దుర్భరమైన రహదారి – ఆందోళనలో ప్రయాణికులు**

ప్రధాన రహదారి పరిస్థితి ఇప్పటికే అంతంతమాత్రంగా ఉంది, దీనికి తోడు రద్దీగా ఉన్న బస్సుల్లో ప్రయాణించడం వల్ల ఎమర్జెన్సీ సమయాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి, ఉన్న ఏడు బస్సులు కాక ఒకటి రాజమండ్రికి, ఈ ఏడు బస్సులలో రెండు చర్లకు, ఐదు వెంకటాపురానికి పరిమితం కావడం వల్ల ప్రయాణికుల డిమాండ్‌కు తగ్గట్టుగా సర్వీసులు లేక వ్యవస్థ కుంటుపడుతోంది,

గతంలో భద్రాచలం నుంచి చర్ల మీదిగా వెంకటాపురం చేరుకొని ఏటూరునాగారం వరకు బస్ సర్వీసు ఉండేది దానివల్ల వరంగల్



లాంటి దూర ప్రయాణాలు చేసే ప్రయాణికులకు ఎంతో సౌలభ్యంగా ఉండేది, ఉచిత బస్సులతో బస్ సర్వీస్ల సంఖ్యను తగ్గించారా లేక బస్సుల కొరతల కొరతతో బస్ సర్వీసులు అనేది స్పష్టంగా తెలియక పోగుడంతో మహిళా ప్రయాణికులు మండి పడుతున్నారు

**పల్లె వెలుగు బస్సులు ప్రధాన రహదారికే అంకితం**

పల్లె వెలుగు బస్సులు పల్లెల్లోకి ప్రవేశించిన దాకలాలు లేవు, కొన్ని ప్రాంతాలలో రహదారి మార్గం చక్కగా ఉన్నప్పటికీ పల్లె వెలుగు బస్సులు ఆ ప్రాంతాలకు వెళ్ళకపోవడం గమనార్హం , భద్రాచలం డివిజన్ గిరిజన ప్రాంతం కావడంతో గిరిజనులు బస్సులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు,

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, అధికారులు తక్షణమే స్పందించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు, బస్సుల సంఖ్యను పెంచడం ద్వారా మాత్రమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించాలని వారు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# డిచ్‌పల్లి ఖిల్లా రామాలయ కమిటీ నూతన కార్యవర్గం నియామకం

**- ఆలయ కమిటీ చైర్మన్ గా అప్పాల గంగాదాస్**

**- ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం స్వీకరణ**



నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో గల అతిపురాతన ప్రఖ్యాత ఖిల్లా రామాలయ కమిటీ తో పాటు హనుమాన్ ఆలయ నూతన పాలకవర్గం నియమితులయ్యారు. ఖిల్లా ఆలయ కమిటీ చైర్మన్ గా అప్పాల గంగదాస్, హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ గా మారు రఘుపతి తో పాటు పాలకవర్గ సభ్యులను నియమించగా.. ఈ సందర్భంగా నియామక పత్రాలను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి చేతుల మీదుగా శనివారం అందుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన పాలకవర్గం సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి కార్యవర్గం కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఖిల్లా రామాలయం కమిటీ పాలకవర్గం సభ్యులు అశోక్, బుస రవి, చెలిమెల వినయ్, ఆర్మూర్ లలిత,కృష్ణమాచారి తో పాటు హనుమాన్ ఆలయ కమిటీ పాలకవర్గం సభ్యులు సుర శ్యామ్,ఆడెపు రాజు, కొంగ ప్రవీణ్, చిన్న ముత్తవ్వ, కృష్ణమాచారి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుదర్శన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి పొలసాని శ్రీనివాస్, రాంచందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ కాంగ్రెస్ నాయకుల పర్యవేక్షణలో SIR ప్రక్రియ -బొబ్బిలి రామకృష్ణ

నిజామాబాద్ జులై 14 :( విజన్ ఆంధ్ర) 5/7/2026 వ తేదీన SIR ప్రక్రియ పై కాంగ్రెస్ పార్టీ తరఫున సూపెర్వైజర్లను జు=గా అసెంబ్లీ కోఆర్డినేటర్ ను నియమించడం జరిగింది. SIR ప్రక్రియ మరింత ముందుకు తీసుకెళ్ళుందుకు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో సంప్రదింపుల జరిపి క్రింద పేర్కొన్న డివిజన్లలో వారి పర్యవేక్షణలో SIR ప్రక్రియ కొనసాగుతుందని, వారు కార్పొరేటర్లను, డివిజన్ ఇంఛార్జులను, సూపర్వైజర్లను స్థానిక నాయకులను సమన్వయ పర్చి ఓటర్లకు ఇబ్బంది కలగకుండా SIR ప్రక్రియ పూర్తి చేసే విధంగా దిశానిర్దేశం చేస్తారు. కావున కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు, ముఖ్యనాయకులు వారికి సహకరించి మీ డివిజన్లలో ూ×= ప్రక్రియను విజయవంతం చేయగలరని పేర్కొన్నారు

# నాటి స్నేహం... నేటి చేయూత!!

**ఆపదలోనూ అండగా నిలిచిన బడి దోస్తులు**

**సతీష్ కుటుంబానికి రూ.20,500 ఆర్థిక సాయం**

**మరణానంతరం మిత్రుడి కుటుంబానికి భరోసాగా నిలిచిన మిత్ర బృందం**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 14 (విజన్ ఆంధ్ర) : చిన్ననాటి స్నేహం కాలంతో మసకబారదని, నిజమైన మిత్రత్వం కష్టకాలంలోనే తన విలువను చాటుతుందని మరోసారి నిరూపించిన హృదయాన్ని హత్తుకునే ఘటన మంగళవారం చోటుచేసుకుంది. శ్రీరామ విద్యాలయంలో కలిసి చదువుకున్న మిత్రుడు గాజుల సతీష్ అకాల మరణంతో విషాదంలో మునిగిపోయిన ఆయన కుటుంబానికి తోడుగా నిలవాలని భావించిన చిన్ననాటి స్నేహితులు తమ ఆప్యాయతను ఆర్థిక సహాయంగా మార్చారు. మిత్రులంతా స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి మొత్తం రూ. 20,500ను సతీష్ సతీమణికి అందజేసి, "నీవు ఒంటరివి కాదు... మేమంతా నీ కుటుంబానికి అండగా ఉంటాం" అనే భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మిత్రులు సతీష్‌తో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కష్టసుఖాల్లో తోడుగా నిలవడమే నిజమైన స్నేహమని, మిత్రుడి జ్ఞాపకాన్ని జీవితాంతం గుండెల్లో నిలుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐరెడ్డి మధు, ఎనగందుల కోటేశ్వర్, కె. శ్రీనివాస్, బి. మల్లేష్, ఎం. చంద్రశేఖర్, ఎస్. రమేష్, ఎ.సత్యనారాయణతో పాటు ఇతర మిత్రులు పాల్గొని సతీష్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కన్నీటి మధ్య అందించిన ఈ చేయూత అక్కడి ప్రతి ఒక్కరినీ కదిలించగా, స్నేహానికి కాలం అడ్డుకాదని, నిజమైన బంధం మనిషి లేని తర్వాత కూడా అతని కుటుంబానికి అండగా నిలుస్తుందని ఈ సంఘటన మరోసారి చాటిచెప్పింది.

# విద్యుత్ సమస్యలపై సర్పంచ్ వినతి





ముధోల్: 14జూలై::విజన్ ఆంధ్ర. ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో ప్రమాద భరితంగా, పేరుకుపోయిన విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ రావుల లావణ్య - శ్రీనివాస్ విద్యుత్ సిబ్బందికి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు.గత ఫిబ్రవరి నెలలో గ్రామసభలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండడం,కంచెలు లేకపోవడంతో మూగజీవాలు, ప్రజలు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. గత గ్రామ సభలో విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ కు గ్రామస్తులు గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై విన్నవించారు. గ్రామంలో ప్రధాన కూడళ్ల వద్ద విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు ప్రమాద భరితంగా ఉన్నాయని సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ సభలో తీర్మానం చేశారు. గ్రామ సభ తీర్మానం ఐదో నెలలు కావస్తున్న సమస్యలు పరిష్కరించుకపోవడంతో సర్పంచ్ మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ అధికారులకు సమస్యలను వెంటనే పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు.

# పాస్‌పోర్ట్ పోగొట్టుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు

వేములవాడ జూలై 14 (విజన్ ఆంధ్ర) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన ఆది రాంప్రసాద్ (36) తన పాస్‌పోర్ట్ పోగొట్టుకున్నట్లు వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, 2026 ఏప్రిల్ 10న తన పాస్‌పోర్ట్ కనిపించకుండా పోయిందని, పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. పోయిన పాస్‌పోర్ట్ నంబర్ టి4788774 అని తెలిపారు. ఈ నేపథ్యంలో తన పాస్‌పోర్ట్‌ను ఎవరైనా దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు వేములవాడ రూరల్ పోలీసులు ఫిర్యాదును స్వీకరించి తదుపరి చర్యలు చేపట్టారు.

# రెంజల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

**...ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్**

నిజామాబాద్ జులై14:( విజన్ ఆంధ్ర) నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల మోడల్ స్కూల్‌లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అవినీతి, అక్రమాలపై అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రిన్సిపాల్ ఫిరోజ్‌పై వచ్చిన ఆరోపణలను సమగ్రంగా విచారించి, ఆయనను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెంజల్ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ అండతో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలు జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించాయని పేర్కొన్నారు. ఏబీవీపీ చేసిన ఆరోపణల ప్రకారం, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన ఏజెన్సీతో కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపించారు. అలాగే విద్యార్థుల హాజరు రికార్డుల్లో మార్పులు చేస్తూ రెండు వేర్వేరు రిజిస్టర్లు నిర్వహించడం, ఉపాధ్యాయుల సంతకాలను ఫోర్జరీ చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వం ఒకేషనల్ కోర్సుల కోసం విడుదల చేసిన నిధులను దారి మళ్లించి,



ఇతర వ్యక్తి బ్యాంకు ఖాతా ద్వారా నగదు డ్రా చేసి భారీ అవినీతికి పాల్పడ్డారని, పాఠశాల ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరికివేసి పర్యావరణానికి నష్టం కలిగించారని కూడా ఏబీవీపీ ఆరోపించింది. ఈ అక్రమాలకు సంబంధించి ఉపాధ్యాయుల సంతకాల ఫోర్జరీ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన విషయాలను ప్రిన్సిపాల్ స్వయంగా అంగీకరించినప్పటికీ ఇప్పటివరకు జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోలేదని ఏబీవీపీ విమర్శించింది. ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు సమాచారం ఉందని, విచారణ అధికారుల ముందు తమకు అనుకూలంగా వాంగ్మూలాలు ఇవ్వాలని ఉపాధ్యాయులు, సిబ్బందిపై ఒత్తిడి తీసుకువస్తున్నారని కూడా ఏబీవీపీ ఆరోపించింది. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించాలని ఏబీవీపీ కోరింది. ప్రిన్సిపాల్ ఫిరోజ్‌ను విధుల నుంచి తొలగించి, ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసింది. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థి ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో రక్షిత్, చెర్రీ దీపాన్, సాయి, క్షేహిత్, శ్రీసాయి, శివ, సాయికుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఓటర్లు ఓట్ల నమోదును త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

## డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల

పాల్వంచ ప్రతినిధి జులై 14(విజన్ ఆంధ్ర): ఓటర్లు తమ ఓట్ల నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని లిడి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్, మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావుఅన్నారు. ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ లో ( సర్ )భాగంగా మంగళవారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గట్టాయిగూడెం 36వ డివిజన్ 53 పోలింగ్ స్టేషన్, పాత పాల్వంచ లో 46వ డివిజన్ పరిధిలోని 77, 78 పోలింగ్ బూత్ ల పరిధిలో జరుగుతున్న ఓట్ల నమోదు కార్యక్రమాన్ని కొత్వాల సందర్శించారు. ఈ సందర్భంగా కొత్వాలమాట్లాడుతూ ఈనెల 24వ తేదీ వరకు ఓటర్ల నమోదు గడువును ఎన్నికల సంఘం నిర్దేశించిందిగడువు సమీపిస్తున్నందు వలన నమోదు ప్రక్రియ ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బి.ఎల్.ఓ లు ఓటర్లకు ఫారాలు పూరించే విధానంపై అవగాహన చేయాలని కొత్వాలఅన్నారు .

ఈ కార్యక్రమంలో లి36వ డివిజన్ కార్పొరేటర్ పైడిపల్లి జయలక్ష్మి, బి.ఎల్.ఓ సందీప్, పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, బి. ఎల్ ఓ లు చందార్కర్, వరుణ్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్,38వ డివిజన్ కాంగ్రెస్ ఇంచార్జి చింతా నాగరాజు, గుర్రం వెంకటరత్నం, బండి రఘు, మిరియాల కొండల్ రావు, షేక్ ఖాజామియా, మసనం శరత్, బూసి శ్రీను, యాటా నాని తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 15 న తెలంగాణ యూనివర్సిటీలో ఇంటర్వ్యూలు

**బ్రోచర్ ను ఆవిష్కరించిన వైస్ ఛాన్స్ లర్ యాదగిరి రావు.**

**ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపు.**



నిజామాబాద్ జులై 14:( విజన్ ఆంధ్ర) ఈనెల 15వ తేదీన టీయూ నిర్వహించనున్న మౌఖిక పరీక్ష బ్రోచర్ ను తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ యాదగిరిరావు ఆవిష్కరించారు.
తెలంగాణ యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, ప్రముఖ ఔషధ సంస్థ హెటెరో డ్రగ్స్ సహకారంతో జూలై 15, 2026న ( ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ) నిర్వహించనున్న వాక్-ఇన్ ఇంటర్వ్యూల బ్రోచర్‌ను తెలంగాణ యూనివర్సిటీ వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు మంగళవారం ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా వైస్-చాన్సలర్ మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే ఇలాంటి క్యాంపస్ నియామక కార్యక్రమాలు విశ్వవిద్యాలయ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.
ఈ వాక్-ఇన్ ఇంటర్వ్యూలకు హెటెరో డ్రగ్స్, హైదరాబాద్ సంస్థ ప్రతినిధులు హాజరై అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. బీఎస్సీ, బీకాం, బీఏ, ఎంఎస్సీ (కెమిస్ట్రీ), ఐటీఐ, డిప్లొమా తదితర అర్హతలు కలిగిన 2024--2026 ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని విభాగాధిపతి డాక్టర్. బి. సాయిలు తెలిపారు.
బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి డా. బి. సాయిలు, సీనియర్ ప్రొఫెసర్ డా. నాగరాజు పాల్గొన్నారు.

# ఇసుకను అక్రమంగా దారి మళ్లించిన మెండోరా ఆర్.ఐను సస్పెండ్ చేసిన కలెక్టర్




నిజామాబాద్, జూలై 14 :( విజన్ ఆంధ్ర ) ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేరిట ఇసుకను అక్రమంగా దారి మళ్లించాడనే ఫిర్యాదు మేరకు, మెండోరా రెవెన్యూ ఇన్స్ పెక్టర్ (ఆర్ఐ) సదానంద్ ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు గట్టి నిఘా కొనసాగిస్తున్న విషయం విదితమే. మన ఇసుక వాహనం బుకింగ్ యాప్ ద్వారా మాత్రమే ఇసుక తరలింపునకు అనుమతులు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మెండోరా మండల రెవెన్యూ ఇన్స్ పెక్టర్ సదానంద్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేరిట ఇసుక తరలింపునకు అనుమతులు పొంది, ఇసుక నిల్వలను దారి మళ్లిస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి వచ్చింది. ఈ విషయమై ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను సైతం అధికారులతో వాకబు చేయించగా, తమకు ఇసుక అందలేదని వెల్లడించారు. దీనిని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి, మెండోరా రెవెన్యూ ఇన్స్ పెక్టర్ సదానంద్ ను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక అక్రమ దారి మళ్లింపు విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి సమగ్ర నివేదిక సమర్పించాలని మైనింగ్ ఏ.డీ ని ఆదేశించారు. ఇసుక రవాణాలో అక్రమాలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అక్రమాలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

# ప్రాణాంతక వ్యాధికి అరుదైన శస్త్ర చికిత్స

**- తల్లి, బిడ్డల ప్రాణాలను కాపాడిన సోమాజిగూడ యశోద ఆస్పత్రి వైద్యులు.**

**--మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన డాక్టర్ జి. విక్రమ్ కుమార్.**



నిజామాబాద్ జులై 14:( విజన్ ఆంధ్ర) : ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న ఒక యువ గర్భిణీ కీ సకాలంలో వైద్యం అందించి రెండు ప్రాణాలను కాపాడగలిగామని సోమాజిగూడ యశోద హాస్పిటల్ కన్సల్టెంట్ క్లినికల్ హెమటాలజిస్ట్ అండ్ బీఎంటీ ఫిజీషియన్, డాక్టర్ జి. విక్రమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని యశోద మెడికల్ సెంటర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన యువ గర్భిణికి ప్రాణాంతకమైన థ్రోంబోటిక్ థ్రోంబోసైటోపెనిక్ పర్పు రా (టీటీపీ ) అనేఅరుదైన, రక్తసంబంధిత వ్యా ధితో బాధపడుతుండగా, సకాలంలో వ్యాధిని గుర్తించి వైద్యం అందించడం జరిగిందన్నారు. పేషెంట్ అత్యంత విషమ పరిస్థితిలో ఆసుపత్రిలో చేరగా, ఆసుపత్రిలోని మల్టీడిసిప్లినరీ బృందం వేగంగా స్పందించి వ్యా ధిని నిర్ధారించిందన్నారు. తక్షణమేఅత్యవసర చికిత్సను అందించి, తల్లి, గర్భస్థశిశువు ఇద్దరికీ ఎలాంటి ప్రాణాపాయం లేకుండా భద్రత కల్పించిదన్నారు.
హెమటాలజీ బృందం వెంటనేవ్యా ధిని నిర్ధారించి, టీటీపీ కి అంతర్జాతీయంగా ఆమోదించబడిన అత్యుత్తమ చికిత్స అయిన థెరప్యూ టిక్ ప్లాస్మా ఎక్స్ఛేంజ్ (ప్లాస్మా ఫెరిసిస్) ను, కార్టికోస్టెరాయిడ్ థెరపీతో కలిపి వెంటనే ప్రారంభించమన్నారు. పేషెంట్ ఈ చికిత్సకు అద్భుతంగా స్పందించిన్నట్లు పేర్కొన్నారు, ఆమె ప్లేట్లెట్ కౌంట్ వేగంగా కోలుకొని మొత్తం ఆరోగ్యం నిలకడగా మారిందన్నారు. హెమటాలజీ పస్రూతి బృందాల నిరంతర పర్యవేక్షణలో ఆమె గర్భం సురక్షితంగా కొనసాగుతోందన్నారు., ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారన్నారు. “థ్రోంబోటిక్ థ్రోంబోసైటోపెనిక్ పర్పు రా అనేది అరుదైన కానీ ప్రాణాంతకమైన మెడికల్ ఎమర్జెన్సీ . చికిత్స చేయకపోతే ఇదిచాలా వేగంగా తీవ్రమవుతుందన్నారు . గర్భధారణ సమయంలో తల్లి, బిడ్డ ఇద్దరినీ
రక్షించడానికి, వ్యాధిని ముందుగా గుర్తించడం, వేగంగా నిర్ధారించడం తక్షణం థెరప్యూటిక్ ప్లాస్మా ఎక్స్ ఛేంజ్ ప్రారంభించడం చాలా ముఖ్యం అని సకాలంలో నిపుణుల జోక్యం సమన్వయంతో కూడిన మల్టీడిసిప్లినరీకేర్ విజయవంతమైన ఫలితాలను సాధించడంలో ఎంత ముఖ్యమో ఈ కేసు స్పష్టం చేస్తుందని అన్నారు. టీటీపీ అనేది ఒక అరుదైన రక్తసంబంధ వ్యాధి అని ఇందులో శరీరం అంతటా చిన్న చిన్న రక్తపు గడ్డలు ఏర్పడతాయన్నారు.
దీనివల్ల
ప్లేట్లెట్ కౌంట్ తీవ్రంగా పడిపోవడం, ఎర్రరక్తకణాలు నాశనం కావడం, మెదడు, మూత్రపిండాలు,
గుండెవంటి ముఖ్యమైన అవయవాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉ ంటుందన్నారు.
గర్భధారణ సమయంలో ఇతర సమస్యల
లక్షణాలు ఈ వ్యాధి లక్షణాలు ఒకేలా ఉండటం వల్ల, ఈ వ్యా ధిని గుర్తించడం సవాలుతో కూడుకున్నదన్నారు. కాబట్టి
వ్యాధిని త్వరగా గుర్తించడం మరింత కీలకం.
ఈ విజయవంతమైన ఫలితం, అత్యధునాతన రోగనిర్ధారణ పద్ధతులు, థెరప్యూ టిక్ ప్లాస్మా ఎక్స్ఛేంజ్ సౌకర్యాలు
సమన్వయంతో కూడిన మల్టీడిసిప్లినరీకేర్ ద్వార సంక్లిష్టమైన హెమటాలాజికల్ ఎమర్జెన్సీ లను నిర్వహించడంలో
సోమాజిగూడ యశోద హాస్పిటల్ కు ఉన్న అత్యుత్తమ నైపుణ్యా న్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సమావేశంలో సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ రూపేష్ షిండే, సీనియర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎం. అమర్నాథ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# చౌటకూర్ లో ఓటర్ల డిజిటలైజేషన్ వేగవంతం..

**52.95 శాతం పూర్తి**

**- 9,445 మంది ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తి.. తహసీల్దార్ నామాల కిష్టయ్య**



చౌటకూర్, జూలై 14 (విజన్ ఆంధ్ర) : చౌటకూర్ మండలంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని తహసీల్దార్ నామాల కిష్టయ్య తెలిపారు.మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మొత్తం 24 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 17,826 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. వారిలో ఇప్పటివరకు 9,445 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేయడం ద్వారా మొత్తం ప్రక్రియలో 52.95 శాతం పూర్తి చేసినట్లు వెల్లడించారు.గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు), గ్రామ పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయడానికి అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమానికి ప్రజలు సహకరించి, అవసరమైన వివరాలు అందించి డిజిటలైజేషన్ ప్రక్రియను విజయవంతం చేయాలని తహసీల్దార్ నామాల కిష్టయ్య కోరారు.

# చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి సువర్ణావకాశం!!



**ఈ నెల 18న ప్రత్యేక లోక్ అదాలత్**

**గోదావరిఖని కోర్టులో 692 చెక్ బౌన్స్ కేసులు పెండింగ్**

**అదనపు జిల్లా న్యాయమూర్తి కోట్ల లావణ్య బాల్ రెడ్డి**

పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 14 (విజన్ ఆంధ్ర) : న్యాయ వివాదాల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ, కక్షిదారులందరికీ ఒక సువర్ణావకాశాన్ని కల్పిస్తూ గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి కోట్ల లావణ్య బాల్ రెడ్డి ఒక వినూత్న పిలుపునిచ్చారు. న్యాయస్థానాల చుట్టూ తిరిగే శ్రమను తగ్గించుకుని, రాజీ మార్గంలో సమస్యలను పరిష్కరించుకోవడమే పరమావధిగా ఈ నెల 18వ తేదీన ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'చెక్ బౌన్స్ కేసుల ప్రత్యేక లోక్ అదాలత్'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఆకాంక్షించారు. మంగళవారం నాడు తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె న్యాయవ్యవస్థ ముందున్న సవాళ్లను, కక్షిదారులకు చేకూరే ప్రయోజనాలను అత్యంత స్పష్టంగా వివరించారు. ప్రస్తుతం 2వ అదనపు న్యాయస్థానంలో ఏకంగా 692 చెక్ బౌన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 47 కేసులకు సంబంధించి నాన్-బెయిలబుల్ వారెంట్లు కూడా అమల్లో ఉన్నాయని ఆమె గణాంకాలతో సహా వెల్లడించారు. ఈ క్లిష్టమైన పరిస్థితుల్లో, రెండు లక్షల రూపాయల లోపు విలువ కలిగిన చెక్ బౌన్స్ కేసుల్లో ఉభయ పక్షాలు రాజీ పడితే, వారిపై ఉన్న నాన్-బెయిలబుల్ వారెంట్లను రద్దు చేయడమే కాకుండా, సదరు మొత్తాన్ని విడతల వారీగా వాయిదాల పద్ధతిలో చెల్లించే అరుదైన వెసులుబాటును కూడా కల్పిస్తున్నట్లు ఒక విభిన్నమైన ప్రకటన చేశారు. చట్టపరమైన చిక్కుల నుండి సామాన్యుడికి ఉపశమనం కలిగించే ఈ గొప్ప అవకాశాన్ని న్యాయవాదులు, కక్షిదారులు చొరవ తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. ఇది కేవలం ఒక ప్రారంభం మాత్రమేనని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రానున్న నవంబర్ 21వ తేదీన బ్యాంకులు, చిట్‌ఫండ్‌లకు సంబంధించిన ఆర్థిక వివాదాల పరిష్కారం కోసం మరొక ప్రత్యేక లోక్ అదాలత్‌ను కూడా విస్తృత స్థాయిలో నిర్వహించబోతున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. కోర్టుల చుట్టూ తిరిగే సమయాన్ని, ధనాన్ని ఆదా చేసుకుని ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి ఇరువర్గాలకు ఇదొక చక్కని వేదిక కానుంది. చట్టం అందించే ఈ రాజీ మార్గాన్ని అందిపుచ్చుకుని, పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించుకోవాలని న్యాయమూర్తి కోట్ల లావణ్య బాల్ రెడ్డి కక్షిదారులను ప్రత్యేకంగా కోరారు.

# పురపాలక ఆధ్వర్యంలో ఆయుష్మాన్ కార్డులు, పీపీఈ కిట్ల పంపిణీ..

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 14 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నమస్తే పథకం ద్వారా పారిశుద్ధ్య, వ్యర్థాల సేకరణ కార్మికులకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు, వ్యక్తిగత రక్షణ పరికరాలు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి , కమిషనర్ టి. మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్హులైన వ్యర్థాల సేకరణ కార్మికులకు ఆరోగ్య భద్రత కల్పించే ఆయుష్మాన్ భారత్ కార్డులు, విధి నిర్వహణలో రక్షణ కల్పించే పీపీఈ కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్, కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యమని, వారి ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం మున్సిపాలిటీ బాధ్యతగా కొనసాగుతుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షేమానికి ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు బూరుగు లత, పిల్లి తిరుపతి, బోలిశెట్టి రాజు,పూదరి వరప్రసాద్, కేశవేని రమేష్, బొల్లి శ్రీనివాస్, గాదెపాక రవీందర్, వాల సుప్రజ, బత్తుల స్వరూప, కో-ఆప్షన్ సభ్యులు ఎండి .హసన్, భూక్య సరోజన, మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, డీబీఆర్వో సిబ్బంది రాజు, జవాన్ ప్రభాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# దళిత వాడల సందర్శన.. పలు సమస్యలపై విన్నపం: గురిజాల శ్రీధర్

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి**

**అర్హులైన వారందరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి**

**తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా సంఘం డిమాండ్**



రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయిన్పల్లి మండలం, ప్రతినిధి జూలై 14 (విజన్ ఆంధ్ర): బోయిన్పల్లి మండలం వరద వెల్లి, గ్రామంలో ఈరోజు వ్యవసాయ కార్మిక సంఘం పక్షాన దళితవాడలను సందర్శించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను సానుకూలంగా విని స్పందించడం జరిగింది. గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ.. గ్రామంలో వ్యవసాయ కూలీలకు, ఇతర సామాన్య ప్రజానీకానికి ఉపాధి లేక, చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ముంపు గ్రామాల ప్రజలకు పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని చెప్పి, మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఎక్కడ కూడా అమలు జరగని పరిస్థితి, అలాగే అర్హులైన,కొత్తవారికి పెన్షన్లు రాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన కొత్త వారందరికీ అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ, ఇంకను అమలు కావడం లేదు. అలాగే యూనియన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఇప్పుడు ఇస్తున్నటువంటి ఆరు ,(6),కేజీల బియ్యం, కుటుంబాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తరఫున డిమాండ్ చేస్తున్నాం. ప్రతి వ్యక్తికి 12 ,కేజీల బియ్యం ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా సంఘం తరఫున డిమాండ్ చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి గురిజాల శ్రీధర్,(రాష్ట్ర కమిటీ సభ్యుడు)మరియు వరద వెల్లి గ్రామస్తులు, వల్లంపట్ల తిరుపతి, కట్కూరు మహేష్, నేదురి సంజీవ్, కంగారి తిరుపతి, కన్న సోమయ్య, వల్లంపట్ల బాలయ్య, వల్లంపట్ల రాజశేఖర్, వల్లంపట్ల హనుమయ్య పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు కేజీ టు పీజీ ఉచిత విద్య

**-టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**

హైదరాబాద్, జూలై 14: తెలంగాణలో అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా జర్నలిస్టుల పిల్లలకు కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, వివిధ పత్రికలు, చానళ్లల్లో పని చేస్తున్న అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివించుకోలేక

పోతున్నారని అన్నారు.

జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని వారి పిల్లలకు అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా అన్ని గురుకుల విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు సీట్ల కేటాయింపులో ప్రత్యేక కోటా ఇవ్వాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల పిల్లలకు గురుకులాల్లో ప్రత్యేక కోటా

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించే విషయాన్ని పరిశీలిస్తామని ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా అన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఏ రాష్ట్రంలోనైనా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యను ఇస్తున్నట్లయితే దాని వివరాలు ఇవ్వాలని ఆమె ఫెడరేషన్ ప్రతినిధులను కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిశీలిస్తానని చెప్పారు. రాష్ట్రంలో అత్యుత్తమంగా నడుస్తున్న గురుకుల విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ప్రత్యేక కోటా కింద సీట్లు ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కుంచెం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వి. రవికుమార్ తదితరులున్నారు.

# పోసానిపల్లిలో గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనుల పరిశీలన

## - ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఆదేశం

చౌటకూర్ జూలై 14 (విజన్ ఆంధ్ర):- చౌటకూర్ మండల పరిధిలోని పోసానిపల్లి గ్రామపంచాయతీలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన గ్రామపంచాయతీ భవన పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కే. శంకర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని గ్రామ సర్పంచ్ రేణుక బాలరాజుకు సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పరిశీలించి, దరఖాస్తు ఫారాల పరిశీలన నిర్వహించారు. బీఎల్ఓ లక్ష్మి ఇప్పటివరకు 60 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిందని ఎంపీడీవోకు వివరించారు. మిగిలిన దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పి. సువర్ణ, పంచాయతీ కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు

# ఆందోల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన ఎంఆర్పీఎస్ నాయకులు.. విద్యార్థుల సమస్యలపై ఆరా

చౌటకూర్ జూలై 14 (విజన్ ఆంధ్ర ):- ఆందోల్-జోగిపేట్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇటీవల ఇద్దరు ప్రిన్సిపాళ్ల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి నిరసన వ్యక్తం చేసిన ఘటనపై ఎంఆర్పీఎస్ సంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి నల్లోళ్ల ప్రవీణ్ కుమార్ మాదిగ, ఎంఆర్పీఎస్ చౌటకూర్ మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల రమేష్ మాదిగ మంగళవారం విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వట్టపల్లి, ఆందోల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల విద్యార్థులు ప్రస్తుతం ఒకే భవనంలో ఉండడం వల్ల తరగతి గదులు, వసతి, తాగునీరు వంటి ప్రాథమిక సౌకర్యాలు సరిపోవడం లేదని గుర్తించారు. అలాగే వట్టపల్లి విద్యాలయానికి వంట సిబ్బంది లేకపోవడంతో ఆందోల్ విద్యాలయ సిబ్బందే రెండు పాఠశాలల విద్యార్థులకు భోజనం సిద్ధం చేయాల్సి వస్తోందని, దీనివల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. అనంతరం రెండు విద్యాలయాల ప్రిన్సిపాళ్లతో సమావేశమై విద్యార్థు లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వట్టపల్లి విద్యాలయానికి ప్రత్యేకంగా వంట సిబ్బందిని ఏర్పాటు చేయాలని, విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన నాయకులు, విద్య పట్ల శ్రద్ధ చూపుతూ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. వట్టపల్లి విద్యాలయానికి ప్రత్యేక భవనం లభించే వరకు సహనంతో చదువుపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ చౌటకూర్ మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల రమేష్ మాదిగతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సర్ విజయవంతం కోసం ప్రత్యేక సహాయక శిబిరం

## పరిశీలించిన తహసిల్దార్ దత్తరెడ్డి



మెదక్ /రేగోడ్ జూలై 14 (విజన్ ఆంధ్ర ): రేగోడ్ మండలకేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సర్ 2026 ప్రత్యేక సహాయక శిబిరాన్ని మంగళవారం మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు పర్వీన్ చోటుమియా ఏర్పాటు చేశారు. సర్ కార్యక్రమం విజయవంతం కోసం హెల్ప్ డెస్క్ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో హెల్ప్ డెస్క్ లో ధరఖాస్తులను మండల తహిసిల్దార్ దత్తరెడ్డి తో కలిసి పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ూ×=)-2026 కార్యక్రమం నిర్వహించబడుతున్న సందర్భంగా ప్రజలు,రాజకీయ పార్టీలు ఓటరు నమోదుకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు అందరూ కృషి చేయాలని, ఇప్పటి వరకు ఫారాలు సమర్పించని కుటుంబాలను గుర్తించి, బిఎల్ఓ లు ప్రత్యేకంగా తిరిగి సంప్రదించాలని తెలిపారు. ఎలాంటి సందేహాలు ఉన్న స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ సవరణ సజావుగా నిర్వహించాలని తహసీల్దార్ దత్తు రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ శ్రీదర్ గుప్త,ఆర్ఐ. శరణప్ప, ఉప సర్పంచ్ ధనలక్ష్మి మల్లికార్జున్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కృష్ణ, నాయకులు కె.ప్రభాకర్, రమేష్, రాధకిషన్, రేగోడ్ మండల వాసవి క్లబ్ అధ్యక్షుడు వినయ్ గుప్త, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి అరుణ్, కరోబర్ హరీష్, బీఎల్ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# పుల్కల్‌లో అక్రమ మట్టి తరలింపు: టిప్పర్లు స్వాధీనం



చౌటకూర్, జూలై 14: పుల్కల్ మండల పరిధిలోని తాడానిపల్లి, ఎస్. ఇటిక్యాల గ్రామ శివారుల్లో అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. రాత్రి వేళల్లో ఎక్స్కవేటర్ల సహాయంతో చెరువులు, కుంటల నుంచి అక్రమంగా మట్టి తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు ప్రత్యేకంగా దాడులు నిర్వహించి అక్రమ మట్టి రవాణాలో ఉన్న టిప్పర్లను పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# ఇచ్చిన హామీలను నెరవేర్చాలి -ఫ్యాప్టో



అనంతపురం జులై 24, ( విజన్ ఆంధ్ర ): అసెంబ్లీ సాక్షిగా ఉపాధ్యాయులకు ఇచ్చిన ప్రతి హామీలను వెంటనే నెరవేర్చాలని ఫ్యాప్టో ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ముందు ఉపాధ్యాయులతో కలిసి పెద్ద ఎత్తున నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన కోర్కెలను తీర్చి అసెంబ్లీలో పలికిన హామీలను వెంటనే నెరవేర్చి న్యాయం చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు శ్రీనివాసులు నాయక్, రమణారెడ్డి, ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

# అరిగెలవారిపల్లిలో అమర హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం విజయవంతం

చంద్రగిరి : గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా అరిగెలవారిపల్లిలో అమర హాస్పిటల్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి భారీ స్పందన లభించింది. తిరుపతిలోని అమర హాస్పిటల్ ఆధ్వర్యంలో జూ పార్క్ మాజీ డైరెక్టర్ దళవాయి మణియాదవ్, పానేటి చెంగల్రాయులు సహకారంతో మంగళవారం అరిగెలవారిపల్లెలో భజన మందిరం( శ్రీకృష్ణ టెంపుల్) వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.? వైద్య శిబిరంలో అమర హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ జనరల్ మెడిసిన్ డాక్టర్ మేఘన, ఆర్థోపెడిక్స్ వైద్య నిపుణులు డాక్టర్ బాలాజీ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా బీపీ, షుగర్ (జీఆర్‌బీఎస్) ఈసీజీ పరీక్షలు చేసి తక్షణ రిపోర్టులను అందించారు. అంతేకాకుండా, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ?ఈ శిబిరానికి అరిగెలవారిపల్లి, పరిసర ప్రాంతాల నుండి వృద్ధులు, మహిళలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమర హాస్పిటల్ సీఈఓ వేణుగోపాల్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, ధనమే ప్రధానం కాకుండా సేవే పరమావధిగా సాగిన అమరహాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం ఎందరో నిరుపేదలకు కొండంత అండగా నిలిచిందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా కూడా చికిత్స అందిస్తున్నామన్నారు. జూపార్క్ మాజీ డైరెక్టర్ దళవాయి మణియాదవ్ మాట్లాడుతూ మన ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో కార్పొరేట్ స్థాయి హాస్పిటల్ అయిన అమరహాస్పిటల్ చే ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, వైద్య పరీక్షలు, ఉచిత మందులు పంపిణీ చేశామన్నారు. తన వంతుగా గ్రామ అభివృద్ధిలోను, గ్రామ ప్రజలు ఆరోగ్య విషయంలోను కృషిచేస్తానన్నారు. ఈ ఉచిత వైద్య



శిబిరంలో పానేటిచెంగల్రాయులు, అరిగెల రామచంద్రయ్య, బొజ్జా వెంకటరత్నం, కసా గోపాల్, అమర హాస్పిటల్ హేమ కుమార్, నరసింహా, లోకేష్ వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన ఎస్ఐ ఉదయ్ కిరణ్

**- మూర్ఛపోయిన వ్యక్తిని సకాలంలో ఆసుపత్రికి తరలింపు**

**- ప్రాణాల తోపాటు తన108 వేల నగదును రక్షించి న పోలీసులు.**

జన్నారం, జులై 14 (విజన్ ఆంధ్ర) : పోలీసులు కేవలం చట్టాన్ని మాత్రమే అమలు చేసే వారు కాద ని ఆపదలో ఉన్నవారికి సైతం అండగా నిలిచే మా నవతా మూర్తులని నిరూపించారు. మూర్ఛపోయి న వ్యక్తిని పోలీసులు సకాలంలో ఆసుపత్రికి తర లించి ప్రాణాలనే కాపాడటమే కాకుండా ఆ వ్యక్తి దగ్గర ఉన్న 108 వేల రూపాయలను రక్షించి తన గ్రామ సర్పంచ్ సమక్షంలో బాధితునికి అందజేసి మానవత్వం చాటుతూ పలువురు చేత భేష్ అని పించుకున్నారు. ఆదివారంరోజు హెడ్ కానిస్టేబుల్ దేవన్న, హోమ్ గార్డు నిలయ్యలు పెట్రోలింగ్ చేస్తు న్న సమయంలో మండలకేంద్రంలోని రోడ్డుపై ఒక వ్యక్తికి మూర్ఛవచ్చి అపస్మారక స్థితిలో పడిపోయి ఉండటం గమనించి ఎస్ఐ ఉదయ్ కిరణ్ కు సమాచారం అందించడంతో స్పందించిన ఎస్ఐ వెంటనే ఒక ప్రైవేట్ అంబు లెన్స్ ద్వారా ఆ వ్యక్తిని లక్షెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. మూర్ఛవచ్చి పడిపోయిన స్థలంలో ఆయనతో పాటు ఒక కవరు ఉండటం గమనించిన ఎస్ఐ దానిని తీసి చూసే సరికి అందులో ఒక లక్ష ఎనిమిది వేల రూపాయ లు ఉన్నాయి. ఎస్ఐ వాటిని భద్రపరిచి మూర్ఛపో యిన వ్యక్తి ఎవరు అనే విచారణ చేయగా మండ లంలోని లోత్గొరై గ్రామానికి చెందిన కుర్సెంగా దేవ్ రావు అని గుర్తించారు. మంగళవారం రోజున పోలీ స్ స్టేషన్ లో ఎస్ఐ ఉ దయ్ కిరణ్ ఆ గ్రామ సర్పం చ్ బోడ శంకర్ నాయక్ సమక్షంలో దేవ్ రావుకు 108 వేల రూపాయలు అప్పగించారు. తన ప్రాణా లను కాపాడటమే కాకుండా పోయినవి అనుకున్న డబ్బులను భద్రపరిచి తిరిగి అప్పగించడంతో దేవ్ రావు పోలీసులకు కృతజ్ఞతలు తెలుపుతూ ఎస్ఐ ఉదయ్ కిరణ్ కు హెడ్ కానిస్టేబుల్ దేవన్న, హోమ్ గార్డు నిలయ్యలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాన ని కన్నీటిపర్యంతం చెందారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జులై 14 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా పూరించిన ఫారాలను తీసుకోవడం, డిజిటలైజ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని, ఫారాలు పూరించడంలో ఓటర్లకు అవగాహన కల్పించడం బిఎల్ఓ ల బాధ్యతని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. మంగళ వారం ఉప్పల్ లోని 375, 376 పోలింగ్ స్టేషన్లో ఏర్పాటుచేసిన ఎన్యూమేరషన్స్ సెంటర్లలో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియను అదనపు కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ,ఫారాల ప్రక్రియను వేగవంతం చేయాలని, స్వీకరించిన ఫారాలను వెంటవెంటనే డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. ఫారాలు పూరించడంలో ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత బి ఎల్ వో లదేనని స్పష్టం చేశారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలను పూరించడంలో బి ఎల్ వో లు ఓటర్లకు సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మార్వో పూల్ సింగ్ ఏఈఆర్వోలు, బి ఎల్ వో లు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు

**- కలెక్టర్ ఇలా త్రిపాఠి**

నిజామాబాద్, జులై 14 :( విజన్ ఆంధ్ర) వచ్చే ఏడాది జూన్, జూలై మాసాలలో జరుగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. గోదావరి పుష్కరాలు–2027 ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి మంగళవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర కన్సల్టెంట్ కుహూ గుప్తాతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గోదావరి పరీవాహక ప్రాంతాలైన తుంగిని, పోచంపాడ్, తడ్ పాకల్ పుష్కర ప్రదేశాల వద్ద చేపట్టాల్సిన పనులు, కల్పించాల్సిన వసతులపై చర్చించారు. శ్రీరాంసాగర్ రిజర్వాయర్ తో కూడిన పోచంపాడ్ పుష్కరఘాట్ వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు వీ.ఐ.పీలు, వీ.వీ.ఐ.పీలు తరలివచ్చే అవకాశాలు ఉ న్నందున వాహనాల పార్కింగ్, సరైన రోడ్డు వసతి, అత్యవసర ఎగ్జిట్ వంటి అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. తడ్ పాకల్, తుంగిని పుష్కరఘాట్ల వద్ద కూడా అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి తేవాలన్నారు. పుష్కర ఘాట్ల వరకు అప్రోచ్ రోడ్లు, పుష్కర ఘాట్ల మరమ్మతులు వంటి పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. నిర్దేశిత పుష్కర ఘాట్లను క్షేత్రస్థాయిలో సందర్శించి, ఇప్పటికే ఆమోదం తెలిపిన పనులు వెంటనే ప్రారంభం అయ్యేలా చూడాలని, అవసరమైన కొత్త పనులను గుర్తిస్తూ ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, ఎండోమెంట్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోసానిపల్లి గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీడీవో శంకర్

చౌటకూర్ జూలై 14 (విజన్ ఆంధ్ర) : మండలంలోని పోసానిపల్లి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను ఎంపీడీవో కె. శంకర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.గ్రామ సర్పంచ్ శ్రీరేణుక మాట్లాడుతూ, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఆధునిక సౌకర్యాలతో గ్రామపంచాయతీ భవనం నిర్మాణం జరుగుతోందని, పనులు పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పీ సువర్ణ, పంచాయతీ కార్యదర్శి అశోక్, తదితరులు పాల్గొన్నారు..



## ప్రతి అర్హత కలిగిన ఓటురు తప్పనిసరిగా బిఎల్ఓలు" అందజేసిన ఎమ్యూనరేషన్ ఫారంలో వారి పూర్తి నమోదు చేసుకోవాలి



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూలై 14 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పి.జే.ఆర్ నగర్ కాలనీలో జరుగుతున్న సర్ ఓటు మ్యాపింగ్ కార్యక్రమాన్నియు ఉ మ్మడి ఆల్విన్ కాలనీ 124 డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ సందర్శించారు. ఈ సందర్భంగా పట్వారీ శశిధర్ గారు మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటురు తప్పనిసరిగా, "బిఎల్ఓలు" అందజేసిన ఎమ్యూనరేషన్ ఫారంలో వారి పూర్తి వివరాలు సక్రమంగా నమోదు చేసుకోవాలని కోరారు.కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అర్హులు కుడా తమ పేర్లు నమోదు చేసుకోవాలని, ఎస్ ఐ ఆర్ ,ఒక సాధారణ ఓటరు జాబితా నవీకరణ ప్రక్రియ. ఇది మీ ఓటు హక్కును తీసివేయడానికి కాదు,అర్హులైన ప్రతి ఒక్కరి పేరు సరైన వివరాలతో ఓటరు జాబితాలో ఉండేలా చేయడమే దీని ఉ ద్దేశ్యం అని అన్నారు.. ఈ కార్యక్రమంలో నాయకులు నాగయ్య, బాబ్జి,సూరి, ప్రవీణ్ "బిఎల్ఓ" ఘుణిత, ఉమ్మ, మరియు టీం పట్వారీ తదితరులు పాల్గొన్నారు.

# సుచిత్ర యూ-టర్న్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

పేట్ బషీరాబాద్, జూలై 14 ( విజన్ ఆంధ్ర): సుచిత్ర ప్రాంతంలోని ఫ్రెండ్స్ సర్కిల్ రెస్టారెంట్ యూ–టర్న్ వద్ద మంగళవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డాడు. పేట్ బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మంగళవారం ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో హీరో గ్లామర్ బైక్ (టీఎస్ 08 ఫీ+ 7572)పై సత్య దైవ ప్రసాద్, కదలి దుష్యంత్‌తో కలిసి సుచిత్ర నుంచి తిరుమలగిరి వైపు వెళ్తున్నారు. అదే దిశలో వెనుక నుంచి వస్తున్న ఐషర్ వాహనం (ఏపీ 29 ఎ 3764) బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో పిలియన్ రైడర్ కదలి దుష్యంత్ (31) తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే ఆయనను సమీపంలోని రష్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంలో గాయపడిన బైక్ రైడర్ సత్య దైవ ప్రసాద్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనపై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన ఐషర్ వాహన డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై విచారణ కొనసాగుతోంది

# జర్నలిస్టు పిల్లలకు 50% ఫీజు రాయితీ అమలు చేయాలి

**-మండల విద్యాశాఖ అధికారికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నేతల వినతి**

**- సానుకూలంగా స్పందించిన ఎంఈఓ**



బూర్గంపాడు మండల ప్రతినిధి జులై 14 (విజన్ ఆంధ్ర )బూర్గంపాడు: ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో వారధులుగా నిరంతరం సేవలందిస్తున్న జర్నలిస్టుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు కోరారు. తెలంగాణ ప్రభుత్వం అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను బూర్గంపాడు మండల పరిధిలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో అమలు చేయాలని కోరుతూ మండల విద్యాశాఖ అధికారి యదు సింహరాజుకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సభ్యులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బర్ల జోషి మాట్లాడుతూ, ప్రజల కోసం నిత్యం శ్రమిస్తూ సమాజానికి సేవలందిస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఫీజు రాయితీ ప్రయోజనం అందకుండా ఉండటం బాధాకరమన్నారు. మండలంలోని అన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ ఉత్తర్వులను తక్షణమే అమలు చేసి, అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వినతిపై స్పందించిన మండల విద్యాశాఖ అధికారి యెదు సింహరాజు, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ అమలుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో త్వరలో సమావేశం నిర్వహించి, ప్రభుత్వ ఆదేశాల అమలుపై చర్చించి అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు రాయితీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు జే.వీ. రత్నం ఆదేశాల మేరకు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లూరి శ్రీహరి బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు దొంకన చంద్రశేఖర్ పర్యవేక్షణలో, పినపాక నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బర్ల జోషి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ సహాయ కార్యదర్శి సాంబరెడ్డి, నియోజకవర్గ ఆర్గనైజింగ్ మెంబెర్ నరసింహారెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షులు శివకుమార్, ఎలక్ట్రాన్ మీడియా ఈసీ మెంబర్ రవి, సభ్యులు, డి. శ్రీనివాస్, రాంబాబు, కోట రమేష్, మల్లారెడ్డి, చేతుల శ్రీనివాస్, సుధాకర్,షాఖ ముజఫర్, కేసుపాక రాజు తదితర టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సభ్యులు పాల్గొన్నారు.

## గుండా మల్లేష్ ప్రజాపోరాటాలు ఆదర్శనీయం సీపీఐ

బెల్లంపల్లి, జూలై 14 విజన్ ఆంధ్ర : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అగ్రనేత, మాజీ శాసనసభ కమ్యూనిస్టు పక్ష నాయకుడు, దళిత హక్కుల పోరాట సమితి జాతీయ నాయకుడు కామ్రేడ్ గుండా మల్లేష్ 79వ జయంతి సందర్భంగా మంగళవారం బెల్లంపల్లిలో ఘనంగా నివాళు లర్పించారు. ఆయన విగ్రహానికి, పార్టీ కార్యాలయంలోని చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన నాయకుడు గుండా మల్లేష్ అని కొనియాడారు. దున్నేవారికే భూమి నినాదంతో రైతు, కూలీల హక్కుల కోసం, ప్రాజెక్టులు, విద్యాసంస్థల ఏర్పాటు కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. లాకప్ డెత్‌లు, జంట హత్యలు, పౌర హక్కుల ఉల్లంఘనలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేసిన ప్రజానాయకుడిగా ఆయనను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి, రాష్ట్ర సమితి సభ్యురాలు బి. పూర్ణిమ, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, సీనియర్ నాయకుడు చిప్ప నరసయ్య, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, జిల్లా సమితి సభ్యుడు బొల్లం తిలక్‌తో పాటు అంబేద్కర్, బాపు, జి.సి. మాణిక్యం, డి.ఆర్. శ్రీధర్, గుండా సరోజక్క, రత్నం రాజం, కొండుబానేష్, బొంకూర్ రామచందర్, బండారి శంకర్, కామెడి దుర్గయ్య, స్వామిదాస్, గుండా ప్రశాంత్, గుండా శంకర్, మహేందర్ రెడ్డి, ఇనుముల రాయమల్లు, మహిళా సమాఖ్య నాయకురాళ్లు బొల్లం సోనీ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



బెల్లంపల్లి, జూలై 14 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో సుభాష్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, ఇతర విద్యా సామగ్రి పంపిణీ చేశారు. టీపీసీసీ రాష్ట్ర క్యాంపెయిన్ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి సహకారంతో 50 మంది విద్యార్థులకు బ్యాగులు, అవసరమైన వస్తువులను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్‌బాబు విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంతోషి రాణి, తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రంగ రామన్న, రత్నం రాజన్న, గెల్లీ జయరాం యాదవ్, సుదగొని నాగేందర్ గౌడ్, ఏనుగు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాలను నింపే సమయంలో జాగ్రత్తలు పాటించాలి

కుల్కచర్ల, జూలై, 14(విజన్ ఆంధ్ర): ఎన్యూమరేషన్ ఫారాలను నింపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని కుల్కచర్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్య గౌడ్ తెలిపారు. కుల్కచర్ల మండల కేంద్రంలో సర్పంచులు, వార్డు సభ్యులు, బీఎల్ఓలకు సర్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్నికల కమీషన్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఓటరు నమోదు, తొలగింపు, సవరణలకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలలో తమ కుటుంబ వివరాలను జాగ్రత్తగా నింపి బీఎల్ఓలకు అందించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్ఓలకు



అందజేయకుంటే ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు వెంకటయ్య, రవీందర్, నాయకులు జంగయ్య, జలీల్, కుల్కచర్ల వార్డు సభ్యులు వెంకటేష్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతో దర్గపల్లిలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి

**- నంగునూరు మండలం దర్గపల్లిలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ 100% పూర్తి**

నంగునూరు మండలం జులై 14 విజన్ ఆంధ్ర : సిద్దిపేట జిల్లా, నంగునూరు మండలం, దర్గపల్లి గ్రామంలో ఎస్ఐఆర్ (రా×=) డిజిటలైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ పెంబర్ల శైలజ రమేష్ తెలిపారు. గ్రామంలోని మొత్తం 716 మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి, బీఎల్ఓ స్వరూప ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, మరియు పాలకవర్గ సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, జిపిఓ రమేష్ సహకారంతో డిజిటలైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే, గ్రామంలో షిఫ్టెడ్, మరణించిన వారివి కలిపి 26 మంది ఓటర్ల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించినట్లు వెల్లడించారు. ప్రజల సహకారంతో ఈ ప్రక్రియ సజావుగా పూర్తైందని, ఇందుకు సహకరించిన బీఎల్ఓ, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలకు సర్పంచ్ పెంబర్ల శైలజ రమేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అక్రమార్కుల గొడ్డలి వేటు...

**- అధికారుల అండదండలతోనే అక్రమ వ్యాపారం?**

మల్హర్, జూలై 14 విజన్ ఆంధ్ర : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండల పరిధిలో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోంది. మల్హర్ లో గత కొన్ని సంవత్సరాలుగా వందలాది పచ్చని వృక్షాలను అక్రమంగా నరికివేస్తూ ధ్వంసం చేస్తున్నారు. ముఖ్యంగా ఔషధ గుణాలున్న వేప చెట్లతో పాటు దుర్షన్, చింత వృక్షాలే లక్ష్యంగా ఈ అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ అక్రమ కలప వ్యాపారంలో అటవీ శాఖ అధికారుల పాత్రపై పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులకు భారీగా ముడుపులు అందుతుండడం వల్లే వారు కళ్ళుండి లేనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూగర్భ జలాల పరిరక్షణ, చెట్ల పెంపకం కోసం ఉద్దేశించిన 'వాల్టా' చట్టంలోని కొన్ని లొసుగులను అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ పచ్చని చెట్లను నిలువునా నరికేస్తూ లక్షల రూపాయలు గడిస్తున్నారు.

దెబ్బతింటున్న పర్యావరణం..

ఒకవైపు పర్యావరణ సమతుల్యత కోసం ప్రభుత్వాలు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తూ హరితహారం వంటి కార్యక్రమాలతో చెట్లను నాటుతుంటే, మరోవైపు అక్రమార్కులు మాత్రం చెట్లను నిర్మూలించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ దారుణాల వల్ల ప్రాంతంలో పర్యావరణం పూర్తిగా దెబ్బతింటోంది. పచ్చదనం కరువై వర్షాభావ పరిస్థితులు తలెత్తడంతో పాటు, వేసవిలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోయి సామాన్య జనం నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాడిచెర్లలో సాగుతున్న ఈ అక్రమ వృక్షాల నరికివేతను అడ్డుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.